



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 39 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తిరుపతి శనివారం 21 ఫిబ్రవరి 2026 వెల : 5/-రూ ॥


VOLUME :1 ISSUE :39 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : TIRUPATI SAT 21 FEBRUARY 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## ఆ రోజు త్వరలోనే వస్తుంది

### ఢిల్లీ ఏఐ సమ్మిట్ లో సీఎం చంద్రబాబు

- ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్
- అమరావతి క్వాంటం వ్యాలీగా మారుతుందని ధీమా వ్యక్తం చేసిన సీఎం
- గూగుల్ రాకతో విశాఖ ఏఐ డేటా హబ్‌గా ఎదుగుతుందని వెల్లడి
- క్వాంటం కంప్యూటింగ్ పరికరాలు తయారు చేసేలా ఏపీలో ఎకోసిస్టం
- ప్రధాని మోదీ ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళతామని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌ను టెక్నాలజీ రంగంలో ప్రపంచ పటంలో నిలబెట్టడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన దార్శనికతను ఆవిష్కరించారు. సమీప భవిష్యత్తులోనే అమరావతి 'క్వాంటం వ్యాలీ'గా, విశాఖపట్నం 'ఏఐ డేటా హబ్'గా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ప్రధాని మోదీ ఆకాంక్షకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ తన వంతు పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు.ఢిల్లీలోని భారత్ మండపంలో వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో భాగంగా శుక్రవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో చంద్రబాబు పాల్గొన్నారు. 'కృత్రిమ మేధస్సు ద్వారా పోటీతత్వం' అనే అంశంపై జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్గే బ్రెండేతో కలిసి ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "త్వరలోనే అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా

- మిగతా 2లో



## భారత్ తో సంబంధాల్లో కొత్త మలుపు

**వీసా సేవలను పునఃప్రారంభించిన బంగ్లాదేశ్**

- ఢిల్లీలో వీసా సేవలను ప్రారంభించిన బంగ్లాదేశ్
- ప్రధానిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల్లోనే కీలక నిర్ణయం
- త్వరలోనే బంగ్లాదేశ్ లో వీసా సేవలను ప్రారంభించనున్న భారత్

పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయం శుక్రవారం నుంచి భారతీయులకు అన్ని రకాల వీసాల మంజూరు సేవలను పునఃప్రారం భిం చింది. గత రెండు నెలలుగా పూర్తిగా నిలిచిపో యిన ఈ సేవలు

- మిగతా 2లో



## చాలా పెద్ద తప్పు చేశావు జగన్!

- లడ్డూ కల్తీ ఆరోపణలకు నిరసనగా మండలిలో వైసీపీ నిరసన
- శ్రీవారి చిత్రపటాలను వైసీపీ ఎమ్మెల్సీలు అవమానించారని లోకేశ్ ఆరోపణ
- చెప్పులతో వెంకన్న ఫొటోలు పట్టుకోవడం క్షమించరాని పాపమన్న లోకేశ్
- జగన్‌కు దేవుడంటే భక్తి, భయం లేవని తీవ్ర విమర్శలు

పెన్ పవర్ డెస్క్:వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను అవమానించారని, ఇది క్షమించరాని పాపమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత జగన్‌కు దేవుడంటే భక్తి, భయం లేవని, హిందువుల మనోభావాలంటే అస్సలు లెక్కేలేదని ఆయన మండిపడ్డారు. తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ అయ్యిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఆరోపణలకు నిరసనగా వైసీపీ సభ్యులు శుక్రవారం శాసనమండలికి శ్రీవారి చిత్రపటాలతో హాజరయ్యారు.

- మిగతా 2లో



## 15 ఏళ్ల సమయమిచ్చినా మీరేం చేయలేరు..

### నాకు 5 నిమిషాలు ఇచ్చే దమ్ముందా?

- మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారన్న రాజాసింగ్
- ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని సవాల్
- ఒవైసీ సోదరులపై రాజాసింగ్ ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:మజ్లిస్ పార్టీ, ఒవైసీ సోదరులపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు 15 నిమిషాలు అడిగారు, కానీ నాకు ఐదు నిమిషాల

- మిగతా 2లో

## దర్యాప్తు చేతకాకపోతే సీబీఐకి ఇస్తామని వార్నింగ్

- అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు
- పోలీసుల తీరుపై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం
- నిందితుడితో కుమ్మక్కు అయ్యారంటూ మండిపడ్డ సీజేఐ ధర్మాసనం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన వైసీపీ మాజీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. అప్పట్లో పోలీసులు ఈ కేసు విషయంలో వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు సంస్థలు, నిందితుడు ఒక్కటయ్యారు అనే రీతిలో వ్యవహరించారని మండిపడింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

- మిగతా 2లో



## ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో ఉద్రిక్తత...

**చొక్కాలు విప్పి నిరసన తెలిపిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు**



- భారత్ మండపంలో ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ ఆందోళన
- చొక్కాలు విప్పి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు
- నిరుద్యోగం, ద్రవ్యోల్బణంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్యకర్తలు
- నిరసనకారులను అదుపులోకి తీసుకున్న భద్రతా సిబ్బంది
- ఘటనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసుల వెల్లడి

ఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు కలకలం సృష్టించారు. 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' జరుగుతున్న సమయంలో, కొందరు కార్యకర్తలు హఠాత్తుగా చొక్కాలు విప్పి ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో సదస్సులో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.

- మిగతా 2లో



## వైఎస్ జగన్‌ను కలిసిన ప్రముఖ నటుడు బ్రహ్మానందం

- గన్నవరం విమానాశ్రయంలో జగన్ తో సినీ నటుడు బ్రహ్మానందం
- గన్నవరం విమానాశ్రయంలో ఒకరికొకరు తారసపడ్డ జగన్, బ్రహ్మానందం
- ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్న వైనం
- గన్నవరం నుంచి బెంగళూరుకు వెళ్లిపోయిన జగన్

పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ప్రముఖ సినీ నటుడు బ్రహ్మానందం కలిశారు. విజయవాడ గన్నవరం విమానాశ్రయంలో ఈ అరుదైన కలయిక చోటు చేసుకుంది. బెంగళూరుకు వెళ్లేందుకు జగన్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఒక పని మీద గన్నవరం చేరుకున్న బ్రహ్మానందం ఎయిర్ పోర్టులోనే ఉన్నారు. ఇద్దరూ

- మిగతా 2లో

## దేవుడి ఫొటోతో నిరసన.. కఠిన చర్యలు తీసుకోవాలి

పెన్ పవర్ డెస్క్:ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యులు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలను ప్రదర్శించడాన్ని కూటమి సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఛైర్మన్ ఛాంబర్ వద్ద మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఎన్డీఏ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైకాపా చేసిన మహాపచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, రామానాయుడు, కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొన్నారు. హిందు మతాన్ని అవమానించారని ఛైర్మన్‌కు మంత్రులు తెలిపారు. ఇలాంటి చర్యను ఛైర్మన్ ఎలా అంగీకరిస్తారని నిలదీశారు. వైకాపా చేసింది తప్పేనని మండలి ఛైర్మన్ మోషేన్ రాజు స్పష్టం చేశారు. వైకాపా సభ్యులను పిలిచి మాట్లాడతానని

- మిగతా 2లో



## యుద్ధానికి అంటూ వస్తే.. అమెరికాను వదిలేదే లేదు



### ఇరాన్ వార్నింగ్

పెన్ పవర్ డెస్క్:మేం ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోం.. యుద్ధాన్ని ఎప్పుడూ ప్రారంభిం చం.. అంతర్జాతీయ చట్టాలను అతిక్రమిస్తే ఊరుకోం..ఆత్మరక్షణ హక్కు మాకు ఉంది.. యుద్ధం అంటూ వస్తే మాత్రం వదిలిపెట్టమని ఇరాన్ మరోసారి అమెరికాకు వార్నింగ్ ఇచ్చింది. ఇరాన్ పై అమెరికా ప్రత్యక్ష సైనిక చర్య కు దిగుతుందని, ఏ క్షణాన్నైనా యుద్ధం వచ్చే అవకాశాలున్నాయని వస్తున్న వార్తల క్రమంలో ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ తాజాగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# భారత పరిశోధనా పితామహుడు

శాంతి స్వరూప్ భట్నాగర్ (ఫిబ్రవరి 21, 1894 ? జనవరి 1, 1955) గురించి తెలియని వారుండరు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రజ్ఞుడు భట్నాగర్. భట్నాగర్ ను భారత పరిశోధన శాలల పితామహుడిగా అభివర్ణిస్తారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ప్రథమ డైరెక్టర్. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (జఉఆ) తొలి మొదటి ఛైర్మన్. దేశంలో మొత్తం 12 పరిశోధన శాలలను ఆయన స్థాపించాడు. ఆయన జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం స్థాపించింది. శాంతి స్వ రూప్ భట్నాగర్ బ్రిటిష్ ఇండియా లోని పంజాబ్ ప్రాంతంలోని, ఇప్పటి పాకిస్తాన్లో ఉన్న షాపూర్లో, హిందూ కాయస్థ కుటుంబంలో 1894 ఫిబ్రవ రి 21న భట్నాగర్ జన్మించాడు. చిన్ననాటి నుండి సాహిత్యమన్నా, విజ్ఞాన శాస్త్రమన్నా విపరీతమైన ఆసక్తిని పెంచు కున్నాడు. కవిత్వం లో మంచి ప్రవేశ ముండేది. బాల్యం నుండే బొమ్మలు, యంత్ర పరికరా లు చేయటంలో ఆసక్తి కనబరిచేవాడు. తన ప్రాథమిక విద్యను దయానంద్ ఆంగ్లో-వేద ఉన్నత పాఠశాల, సికింద్రా బాద్ (బులంద్ షహర్ ) నుండి పూర్తి చేశాడు. 1911లో లాహోర్ లోని కొత్తగా స్థాపించ బడిన దయాల్ సింగ్ కాలేజీలో చేరాడు. భట్నాగర్ 1913లో పంజాబ్ విశ్వ విద్యాలయం ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడ య్యాడు. ఫోర్మాన్ క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. 1916లో భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. విదే శాల్లో చదువుకోవడానికి దయాళ్ సింగ్ కాలేజ్ ట్రస్ట్ ద్వారా స్కాలర్ షిప్ పొంది, యూనివర్సిటీ కాలేజ్ లండన్లో 1921 లో సైన్స్లో డాక్టరేట్ పొందాడు. భారతదేశానికి తిరిగి వచ్చి, కొత్తగా స్థాపించ బడిన బనా రస్ హిందూ విశ్వవిద్యాలయం లో రసాయన శాస్త్ర ప్రొఫెసర్గా చేరా డు. తర్వాత విశ్వ విద్యాలయం లోని ఫిజికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, యూనివర్సిటీ కెమికల్ లాబొరే టరీస్ డైరెక్టర్గా లాహోర్కు మారాడు. మాగ్నెటోకెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ ఆఫ్ ఎమల్షన్ రంగాలలో పరిశోధనతో పాటు, అప్లైడ్ కెమిస్ట్రీ లో కూడా గణనీయమైన కృషి చేసాడు. రావల్పిండి ప్రాంతంలో ఒక బ్రిటిష్ కంపెనీ చమురు అన్వేషణా కార్యక్రమం చేపట్టిన రోజుల్లో ఒక సమస్య ఎదురైంది. చమురు ఉన్న ప్రాంతం బురదమయంగా ఉండేది. పైగా డ్రిల్ చేసిన బురద ఉప్పు నీటితో కలిసి గట్టిగా రాయిలాగా మారి, డ్రిల్లింగ్ కు అంతరాయం కలిగించేది. ఒక దశలో పనిపూర్తిగా ఆగిపోయేది. అపుడు కంపెనీవారు భట్నాగర్ ను సలహా కోరారు. భట్నాగర్ ఈ సమస్యను కూలం కషంగా పరిశీలించి అతిసులభ మైన, చవకైన పరిష్కారాన్ని సూచించాడు. డ్రిల్ చేసిన బురదకు జిగురు కలపమని సలహా ఇచ్చా డు. జిగురు కలిపిన బురదకు స్నిగ్ధత తక్కువై గట్టిపడకుండా ఉండటంతో బ్రిటీష్ కంపెనీ కొన్ని లక్షల రూపాయల నష్టం నుండి బయట పడింది. వెంటనే కంపెనీ వారు ఆయనకు లక్షాయాభై వేల రూపాయలు బహుకరించారు. ఆ సొమ్మును లాహ్వరు యూనివర్శిటీకి చమురు పరిశోధనల కోసం విరాళంగా ఇచ్చాడు. భట్నాగర్ చమురు పరిశోధనా భివృద్ధికి ఎంతో కృషి చేశాడు. మైనాన్ని వాసన లేకుండా ఎలా రూపొందించాలో ఆయన తెలియ చేశాడు. కిరోసిన్ ను శుద్ధి చేయ డం, వెలుగును ఎక్కువ చేయటం, ఆదా చేయడం గురించి భట్నాగర్ విలువైన సమాచారాన్ని అందించా డు. పెట్రోలియం నుండి విడుదల య్యే వ్యర్థ పదార్థాలను చమురు పరిశ్రమలో ఎలా ఉపయోగించాలో పరిశోధించాడు. ఆయన ఊఎఖీ కు డైరెక్టరయ్యాడు. వ్యర్థ పదార్థాల నుండి ప్లాస్టిక్స్ చేయడం, రబ్బరు వస్తువులను రూపొందించడం వంటి పరిశోధనలను ముమ్మరం చేశాడు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ స్వయం ప్రతిపత్తి సంస్థగా, 28 సెప్టెంబర్ 1942న అమలులోకి వచ్చింది. 1943లో ఆయనను ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీగా ఎన్ను కున్నారు. శాంతి స్వరూప్ భట్నాగర్... హోమీ జహంగీర్ భాభా, ప్రశాంత చంద్ర మహలనోబిస్, విక్రమ్ సారాభాయ్ తదితరులతో పాటు భారతదేశ స్వాతంత్ర్యానంతర శాస్త్ర సాంకేతి క మౌలిక సదుపాయాలు, విధానా ల నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించాడు. విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా మరియు ప్రభుత్వ విద్యా సలహాదారుగా కూడా పని చేశాడు. నేషనల్ రీసెర్చ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్థాపనలో అతను కీలక పాత్ర పోషించి, దేశంలో ఇండస్ట్రి యల్ రీసెర్చ్ అసోసియేషన్ ఉద్యమానికి నాంది పలికాడు. భట్నాగర్ భారత దేశములో వివిధ ప్రాంతాలలో... సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నలాజికల్ ఇన్స్టిట్యూట్ మైసూర్ , నేషనల్ కెమికల్ లాబొరేటరీ పూణే , నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ న్యూఢిల్లీ , నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ జంషెడ్పూర్ , సెంట్రల్ ఫ్యూయల్ ఇన్స్టిట్యూట్ ధన్బాద్ వంటి మొత్తం 12 జాతీయ ప్రయోగ శాలలను స్థాపించాడు. నెహ్రూ హయాంలో ప్రభుత్వం నుండి నిధులను సమకూర్చి చమురు పరిశోధనా వనరులను అభివృద్ధి చేశాడు. దేశంలో చమురు వనరు లు, చమురు నిక్షేప స్థావరాలు, అణుఖనిజ పరిశ్రమలు అభివృద్ధి చెందాయంటే అది భట్నాగర్ కృషే ప్రధాన కారణం. భట్నాగర్ 1955 జనవరి 1వ తేదీన మరణించాడు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శాస్త్ర వేత్తలు కనబరిచిన ప్రతిభకు నిదర్శనంగా, ఆయా రంగాలకు వారు అందించిన సేవలకు గుర్తింపు గా ప్రతి ఏటా ఇచ్చే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు భారత శాస్త్ర రంగంలో అత్యున్నతమైనదిగా పరిగణిస్తారు. ఈ పురస్కారం మొదటి సారి 1958 లో యివ్వబడి నది. 45 సంవత్సరాల వయసు వరకు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాలలో పరిశోధన చేస్తూ ఉంటే ఈ పురస్కారానికి అర్హత పొందు తాడు. ఈ పురస్కారం ఒక పతకం, నగదు బహుమతి 5 లక్షలు అందజేయ బడుతుంది. అదనంగా ఆ పురస్కార గ్రహీత 65 వ సంవత్సరం వరకు ప్రతీ నెలా రూ. 15,000 అందజేయ బడుతుంది.

# ఆ రోజు త్వరలోనే వస్తుంది

- మొదటి పేజి తరువాయి

మాట్లాడే రోజు వస్తుంది. కేవలం వినియోగించుకోవడమే కాకుండా, ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్కు సంబంధించిన పరికరాలను తయారు చేసి, ఎగుమతి చేసేలా ఇక్కడ ఒక ప్రత్యేకమైన క్వాంటం ఎకో సిస్టంను రూపొందిస్తున్నాం" అని వివరించారు. గూగుల్ వంటి దిగ్గజ సంస్థల రాకతో విశాఖపట్నం ఒక కీలకమైన ఏఐ డేటా హబ్గా మారుతుందని తెలిపారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా 'సావరిన్ ఏఐ'ని వినియోగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, డీప్ టెక్నాలజీ రంగంలో ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్టెక్ పార్క్ వంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని, ఈ రంగాల్లో భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలు సాధిస్తుందన్న పూర్తి విశ్వాసం తనకు ఉందని, ఈ సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

# చాలా పెద్ద తప్పు చేశావు జగన్!

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా వారు బూట్లు, చెప్పులతోనే స్వామివారి చిత్రపటాలను పట్టుకుని ప్రదర్శించారని, సభ ముగిశాక వాటిని అక్కడే వదిలేసి వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. ఈ ఘటనపై లోకేశ్ తీవ్రంగా స్పందించారు. "శ్రీవారికి చేసిన మహా పాపం కప్పిపుచ్చుకోవడానికి మహాపరాధం చేశావు జగన్. మీ వైసీపీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో వెంకటేశ్వర స్వామి చిత్రపటాలు పట్టుకుని మహాపరాధం చేశారు. అంతే కాకుండా, కౌన్సిల్లో ప్రదర్శించిన శ్రీవారి ఫొటోలు అక్కడే విసిరేసి వెళ్ళిపోవడం క్షమించరాని పాపం. వెంకన్నతో పెట్టుకోవద్దు జగన్!" అంటూ లోకేశ్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. ఈ మేరకు తన విమర్శలకు ఆధారంగా నారా లోకేశ్ వీడియోను కూడా పంచుకున్నారు.

# ఢిల్లీ ఏఐ సమ్మిట్లో ఉద్రిక్తత...

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలను ప్రస్తావిస్తూ కార్యకర్తలు నిరసనకు దిగారు. 'పీఎం ఈజ్ కాంప్రమైజ్డ్' అంటూ పెద్దగా నినాదాలు చేస్తూ, సమ్మిట్ బోర్డు ముందు నిలబడి గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి, ఆందోళనకారులను బలవంతంగా బయటకు పంపించి, అదుపులోకి తీసుకున్నారు. వారిని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్కు తరలించారు. అంతర్జాతీయ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్న ఈ ఉన్నతస్థాయి సదస్సులో భద్రతను దాటుకుని కార్యకర్తలు ఎలా లోపలికి వచ్చారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ నిరసనకు సంబంధించిన వీడియోలను యూత్ కాంగ్రెస్ తమ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. ప్రభుత్వం జాతీయ ప్రయోజనాల కంటే కార్పొరేట్ శక్తులకే ప్రాధాన్యత ఇస్తోందని యూత్ కాంగ్రెస్ ఒక ప్రకటనలో ఆరోపించింది.

ఈ ఘటన తర్వాత భారత్ మండపం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. కాగా, ఈ సదస్సును రాహుల్ గాంధీ గతంలోనే ఒక 'ప్రచార కార్యక్రమం'గా విమర్శించిన విషయం తెలిసిందే. అంతర్జాతీయ వేదికపై ఇలాంటి నిరసనలు సరికాదని అధికార పార్టీ నేతలు విమర్శించగా, ఇది తమ నిరసన తెలిపే హక్కు అని విపక్ష నేతలు సమర్థించుకున్నారు.

# దర్యాప్తు చేతకాకపోతే సీబీఐకి ఇస్తామని వార్నింగ్

- మొదటి పేజి తరువాయి

నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారిస్తూ.. నాటి దర్యాప్తులో పోలీసుల వైఖరిని ఎండగట్టింది. "నిందితుడితో పోలీసులు ఇప్పటికీ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఇంత దారుణంగా వ్యవస్థలు నిర్వీర్యం అవుతుంటే డీజీపీ, ఎస్పీలు ఏం చేస్తున్నారు?" అని ధర్మాసనం నిలదీసింది.

**డిఫాల్ట్ బెయిల్ కుట్ర..**

నాడు వైసీపీ ఎమ్మెల్సీకి బెయిల్ వచ్చేలా ఉద్దేశపూర్వకంగానే ఛార్జిషీట్ దాఖలు చేయడంలో జాప్యం చేశారని, నిందితుడితో పోలీసులు కుమ్మక్కు అయ్యారని ఇది స్పష్టం చేస్తోందని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీకు దర్యాప్తు చేయడం చేతకాకపోతే చెప్పండి.. కేసును సీబీఐకి అప్పగిస్తాం" అని ఘాటుగా హెచ్చరించింది.

ప్రస్తుత ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం

గత ప్రభుత్వంతో పాటు ప్రస్తుత ప్రభుత్వంపైనా కోర్టు ప్రశ్నలు సంధించింది. "నాడు తప్పు చేసిన పోలీసు అధికారులపై ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు? బాధ్యులైన వారిని ఎందుకు వదిలేశారు?" అని నిలదీసింది.

**'డెడ్లైన్' ఆదేశాలు..**

నవంబర్ 18 లోపు ట్రయల్ కోర్టు విచారణను పూర్తి చేయాలని, కేసు విచారణ కోసం మార్చి 31 లోగా హైకోర్టు ఒక సీనియర్ జ్యుడిషియల్ అధికారిని ప్రత్యేకంగా నియమించాలని, జాప్యానికి తావులేకుండా రోజువారీ ప్రాతిపదికన విచారణ సాగాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో హైకోర్టు జోక్యం చేసుకుని అడ్డంకులు సృష్టించవద్దని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# దేవుడి ఫొటోతో నిరసన.. కఠిన చర్యలు తీసుకోవాలి

- మొదటి పేజి తరువాయి

ఛైర్మన్ తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పించి లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు.

**హిందువుల మనోభావాలు దెబ్బతీశారు.. పయ్యావుల**

చట్టసభ సాక్షిగా వైకాపా సభ్యులు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. హిందూ మతాన్ని రెచ్చగొట్టేలా వైకాపా ప్రవర్తించిందని మండిపడ్డారు. హద్దులు దాటి ప్రవర్తించి దేవదేవుడు పట్ల మహాపచారానికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు ఎంతో కలచివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగటం తగదన్నారు. సంయమనం పాటించే కొద్దీ రెచ్చగొడుతున్నారని.. హిందువుల పట్ల వైకాపా విధానం ఇదేనా అని నిలదీశారు. వెంకటేశ్వర స్వామి పట్ల తమ పార్టీ విధానం ఇదేనని జగన్ చెప్తున్నారా..? అని ప్రశ్నించారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు.

**జగన్ డైరెక్షన్లోనే.. కందుల దుర్గేష్**

జగన్ డైరెక్షన్లోనే వైకాపా ఎమ్మెల్సీలు స్వామి వారిని తీవ్రంగా అవమానించారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. జనసేన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని నిర్లక్ష్యంగా విసిరేయడం తేలిగ్గా తీసుకునే విషయం కాదని ధ్వజమెత్తారు.

జగన్ క్షమాపణలు చెప్పాలి.. సోము వీర్రాజు

జాతి క్షమించరాని నేరానికి వైకాపా సభ్యులు, జగన్ పాల్పడ్డారని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుయ్యబట్టారు. సభ వాయిదా పడగానే వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను ప్లకార్డులతో పాటు విసిరేసి వెళ్లారని ఆయన ఆరోపించారు. భారతజాతికి జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరస్వామి అంటే ఇంత చులకన భావమేంటని మండిపడ్డారు.

# యుద్ధానికి అంటూ వస్తే.. అమెరికాను వదిలేదే లేదు

- మొదటి పేజి తరువాయి

ఎప్పుడూ యుద్ధం కోరుకోదు, యుద్ధాన్ని ఎప్పుడూ ప్రారంభించదు, అమెరికా సైనిక చర్యకు గనక దిగితే మాత్రం అమెరికాను ధీటుగా ఎదుర్కొంటామని ఐక్యరాజ్య సమితి జనరల్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ కు రాసిన లేఖలో తెలిపారు. ఇరాన్ పై దాడి చేస్తామని అమెరికా పదే పదే బెదిరిస్తోంది.. డియెగో గార్సియా సైనిక స్థావరం నుంచి దాడికి సిద్ధమవుతోంది. ఇది ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే, ఈ చర్యలు ఆ ప్రాంతాన్ని సంక్షోభంలో పడేస్తాయని ఇరవానీ అన్నారు. ఇరాన్ పై అమెరికా పదే పదే బెదిరింపులకు పాల్పడుతోంది.. ఇటీవల అమెరికాతో ఒప్పందం చేసుకోకపోతే దాడి చేస్తామని ట్రంప్ బహిరంగంగానే బెదిరించారు. డియెగో గార్సియా, ఫెయిర్ పోర్టు ఎయిర్ ఫీల్డ్ ను ఉపయోగించే అవసరం వస్తుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని ఇరవానీ అన్నారు.

అమెరికా సైనిక దురాక్రమణకు దిగితే ఐక్యరాజ్య సమితి చార్టర్ లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణకు అమెరికాను ధీటుగా ఎదుర్కొంటాం.. మరీ విధ్వంసానికి దిగితే అమెరికాను వదిలిపెట్టమని ఇరవానీ హెచ్చరించారు. అటు అమెరికా, ఇటు ఇరాన్ వరుస బెదిరింపు స్టేట్ మెంట్లతో త్వరలో ఇరాన్ పై అమెరికా సైనిక చర్యకు దిగుతుందా? అన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి.

## భారత్ తో సంబంధాల్లో కొత్త మలుపు

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు మళ్లీ అందుబాటులోకి వచ్చాయి.

బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల్లోనే ఈ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీలో వీసా సేవలు ప్రారంభమయ్యాయి. త్వరలో ఢాకాలోని భారత రాయబార కార్యాలయంలో కూడా బంగ్లాదేశ్ నుంచి భారత్ కు వీసాలు జారీ చేసే సేవలు మళ్లీ మొదలవుతాయని బంగ్లాలోని భారత రాయబార కార్యాలయం అధికారి అనిరుద్ధ దాస్ తెలిపారు. మెడికల్, టూరిజం సహా అన్ని రకాల వీసాలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో, ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిన పడే అవకాశం ఉంది.

## 15 ఏళ్ల సమయమిచ్చినా మీరేం చేయలేరు.. నాకు 5 నిమిషాలు ఇచ్చే దమ్ముందా?

- మొదటి పేజి తరువాయి

సమయం ఇచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజాసింగ్ మాట్లాడుతూ, తమకు 15 నిమిషాల సమయం ఇస్తే హిందువులు లేకుండా చేస్తానని అన్నారని మండిపడ్డారు.

15 నిమిషాలు కాదు 15 గంటలు, 15 రోజులు, 15 నెలలు అవసరమైతే 15 సంవత్సరాలు ఇచ్చినా మీరేం చేయలేరని అన్నారు. మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారు మీరేం చేస్తారని మండిపడ్డారు. కానీ తమకు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని అన్నారు. తాను ఎక్కడకు రావాలో చెప్పాలని అన్నారు. నీ ప్రాంతానికి రావాలా, నీ ఇంటికి రావాలా, ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని అన్నారు. తనకు కత్తి, తుపాకీ ఏదీ వద్దని వ్యాఖ్యానించారు.

## వైఎస్ జగన్ను కలిసిన ప్రముఖ నటుడు బ్రహ్మానందం

- మొదటి పేజి తరువాయి

ఒకరికొకరు తారసపడ్డారు. ఈ సందర్భంగా ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. బ్రహ్మానందం యోగక్షేమాలు, ఆరోగ్యం గురించి జగన్ అడిగి తెలుసుకున్నారు. వీరి కలయికకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## పెమ్మసాని 18 రోజులు సినిమా చూపించాడు.. పారిపొమ్మని సీఐ చెప్పాడు: అంబటి రాంబాబు

మూడు కేసులకు సంబంధించి 18 రోజుల పాటు మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ మూడు కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై మండిపడ్డారు. "24 గంటల్లో సినిమా చూపిస్తానన్నావ్... 18 రోజులు సినిమా చూపించావు. ఇందులో ఎవరు హీరో? నేనే హీరో. మీరు విలన్లు అయ్యారు" అని అన్నారు.

**మీడియాతో మాట్లాడుతూ అంబటి చేసిన కీలక వ్యాఖ్యలు ఇవే:**

ఇరవై రోజులుగా ఎన్నో జరిగాయి. ఏం జరిగిందో ప్రజలు అర్థం చేసుకున్నారు.

జనవరి 31 అర్ధరాత్రి నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు బెయిల్ ఇవ్వడంతో మొన్న విడుదల అయ్యాను.

ఈ 18 రోజులు మాట్లాడే అవకాశమే రాలేదు. నా కూతురు అందరికీ అర్థమయ్యేలా అన్ని విషయాలు చెప్పింది.

టీడీపీ కట్టిన ఫ్లెక్సీ వద్దకు వెళ్లి మంచి పద్ధతి కాదని చెప్పే ప్రయత్నం చేశాను. ఫ్లెక్సీని నేను చించివేయలేదు.

మరుసటి రోజు గుళ్లలో పూజలు చెయ్యమని పార్టీ నుంచి సమాచారం వచ్చింది. పర్మిషన్ తీసుకుని అక్కడకు వెళ్లాను.

తిరిగి వస్తుంటే కారు అడ్డుకుని అమ్మ, అక్క అంటూ బూతులు తిట్టారు. ఆ తర్వాతే నేను కూడా తిట్టాను.

తర్వాత ఇంటికొచ్చి ఆలోచిస్తే నా అంతరాత్మ ఒప్పుకోలేదు. నేను అన్న మాటలు చంద్రబాబును ఉద్దేశించి కాదు. ఇంటికి వచ్చిన తర్వాత పశ్చాత్తాపానికి గురయ్యాను.

ఐదు గంటలకు ఇంటివద్దకు పలు నియోజకవర్గాల నుంచి భారీగా జనం వచ్చారు. నా కుటుంబ సభ్యులు, మనవళ్లు ఇంట్లో ఉన్నారు. ఏడు గంటలపాటు టీడీపీ గూండాలు రచ్చ చేశారు. ఇంటిపై దాడి చేసిన వారంతా కమ్మవారే. పోలీసుల అండతో రెచ్చిపోయారు. ఎక్కడైనా పోలీసులు, గూండాలు ఒక్కటవుతారా?

వైసీపీ వారిని మా ఇంటి వద్దకు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. పారిపోవాలని సీఐ గంగా వెంకటేశ్వర్లు నాతో చెప్పారు. పారిపోవడం కన్నా చచ్చిపోవడం మేలని నేను చెప్పాను.

పోలీసులు నన్ను తీసుకెళ్లి లాకప్ లో పెట్టారు. రాత్రి 2 గంటలకు స్టేషన్ పైకి తీసుకెళ్లి నన్ను కొట్టడానికి ప్రయత్నించారు. కానీ కొట్టలేదు. నన్ను కొట్టడానికి ప్రయత్నించడంపై న్యాయపోరాటం చేస్తా.

నల్లపాడు సీఐ వంశీ రిమాండ్ రిపోర్ట్ లో... "కమ్మ నా కొడకల్లారా" అని తిట్టానని రాశాడు. నా ఇద్దరు అల్లుళ్లు కమ్మవారే. కులాల పేరుతో రెచ్చగొడుతున్నది మీరే.

పెమ్మసాని చంద్రశేఖర్ మూల్యం చెల్లించే రోజు వస్తుంది. తప్పక మూల్యం చెల్లించాల్సిందే.

పోలీసులతో హత్యలు చేయించడం చంద్రబాబుకు అలవాటే. ఆ అలవాటు నారా లోకేశ్ కి వచ్చింది.

నేను కమ్మ వ్యతిరేకిని కాదు. నన్ను నిర్మూలించాలని రెడ్ బుక్ లో రాసుకున్నారట.

చంద్రబాబు కమ్మని ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ కాపుకాస్తున్నాడు.

# గోవింద నామస్మరణతో సాగిన వైకుంఠ వాసుని రథోత్సవం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ 20.
గత తొమ్మిది రోజుల నుంచి బుచ్చిరెడ్డిపాలెం లో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దశమవార్షికోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నా డు జరిగిన రథోత్సవంలో కలియుగ వైకుంఠ వరదలు శ్రీ వెంకటేశ్వర స్వామి ఊరేగింపు భక్తులకు దర్శనమిచ్చారు వేలాదిమంది భక్తుల గోవింద నామస్మరణతో 10 గంటలకు ప్రారంభమైన రథం పురవీధులలో భక్తులకు దర్శనమిస్తూ మూడు గంటలపాటు సాగింది బుచ్చిరెడ్డిపాలెం మండలం తో పాటు పరిస్థితుల్లో మండలాల్లో నుంచి కూడా భక్తులు పెద్ద ఎత్తున రావడంతో బుచ్చిరెడ్డిపాలెం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు వచ్చిన భక్తులకు స్థానికులు పెద్ద ఎత్తున చలివేంద్రాల ద్వారా అన్న ప్రసాదాలు మజ్జిగ చిరుతండ్లను పంపిణీ చేశారు పురవీధులలో రథోత్సవం జరుగుతున్నందున ఎలాంటి అవార్ధాలు జరగకుండా స్థానిక శ్రీనివాసరెడ్డి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు వెంకటేశ్వర స్వామి దర్శనం ఇవ్వనున్నారు భక్తులు ఈ అద్భుత రథోత్సవంలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పదాన్ని లాగారు నెల్లూరు జిల్లాలోనే ప్రత్యేకత సంతరించుకున్న ఈ దేవాలయం పదోవ వార్షికోత్సవం పురస్కరించుకొని బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# మా భూమిని లాక్కుని మా కడుపు కొట్టొద్దు.

## - రామవరపాడు గ్రామ రైతు కుటుంబం కన్నీటి పర్యంతం



కావలి ఆర్సి ఇంచార్జ్ పెన్ పవర్ ఫిబ్రవరి 20
రెక్కాడితే కానీ డొక్కాడని మా బ్రతుకులపై జలదంకి మండలం రామార్వాడు గ్రామ సర్పంచ్ భర్త ఉన్నం రవీంద్ర బాబు ఆధ్వర్యంలో మా పొలంలో ఉన్న జామాయిల్ మెక్కలను జెసిబితో తొలగించి మా భూమిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని అడిగితే దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని జలదంకి మండల రామార్వాడు గ్రామానికి చెందిన రైతు మారినేని వెంకటేశ్వర్లు, వరలక్ష్మి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. శుక్రవారం కావలి పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్ నందు వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా అదే గ్రామంలో ఉంటున్నామని మాకు సెంటు భూమి లేదని, ఉండటానికి ఇల్లు కూడా లేదని. రెక్కాడితే గాని డొక్కాడని మా బతుకులకు ఆ 50 సెంట్ల భూమే ఆధారం అన్నారు . అయితే మా భూమిలో ఆశగా వేసుకున్న జామాయిల్ మొక్కలను మా గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త అయిన ఉన్నం రవీంద్ర బాబు ఆధ్వర్యంలో కడియాల వినోద్ కుమార్, ఉమామహేశ్వరరావు, మాదాల మురళీకృష్ణ, కడియాల కిరణ్ కుమార్ లు జేసీబీ లతో తొక్కించి నాశనం చేశారన్నారు. ఈ విషయం తెలిసి వారిని ప్రశ్నిస్తే మీకు దిక్కున చోట చెప్పుకోండి అవసరమైతే మిమ్మల్ని కూడా ఈ గ్రామం నుంచి తరిమేస్తామని బెదిరించారన్నారు. గ్రామంలో ఈ 50 సెంట్ల భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని గ్రామంలో మాకు ఎటువంటి ఆస్తి పాస్తులు కూడా లేవని తెలిపారు. మాకు ఎవరూ లేరనే తలంపుతో వారు మమ్మల్ని బెదిరిస్తూ మాకు ఉన్న ఆ 50 సెంట్లు భూమిని బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని వాపోయారు. అలానే మాకు వారి నుంచి ప్రాణహాని కూడా ఉందని కన్నీరు మునియ్యారు. పేదలమైన తమపై జరుగుతున్న ఈ అన్యాయంపై ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని వారు వేడుకున్నారు.

# తిరుచ్చి వాహనం పై పద్మావతి అమ్మవారు.





తిరుపతి,పెన్ పవర్,ఫిబ్రవరి 20.
తిరుచానూరులో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చి పై నాలుగు మాడా వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. శుక్రవారం సాయంత్రం తిరుచి వాహనంలో విహరించగా ఉదయం అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు, అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉద్యానవనంలో అమ్మవారి ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా అభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఉంజల్ సేవ నిర్వహించారు. అనంతరం విశేషాలంకరణలో విరాజిల్లుతున్న అమ్మవారు తిరుచ్చి పై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి కర్పూర నీరాజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏవిఎస్వో రాధాకృష్ణమూర్తి, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ సురేష్ అర్చకులు బాబు స్వామి, ఇన్స్పెక్టర్లు ప్రసాద్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.




నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 20.
ప్రతి రోజు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నెల్లూరు రూరల్ ప్రజలకు ఉదయం 7గంటల నుండి రాత్రి 8 గంటల వరకు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నాము.టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు యువనేత, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో నిర్విరామంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిష్కారం దిశగా చేపట్టవలసిన చర్యలు అధికారులతో కలసి ఎప్పటికపుడు సమన్వయం చేస్తున్నాం, పరిష్కారం అయ్యే ప్రతీ సమస్యను పరిష్కరిస్తాం .టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన వినతులలో ఇప్పటికే 27 కోట్లతో 240 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది. శరవేగం పనులు సాగుతున్నాయి, అతి త్వరలోనే వాటిని ప్రారంభించనున్నాము. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.
పై కార్యక్రమంలో జి.జి.హెచ్. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మడపర్తి శ్రీనివాసులు, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి.కృష్ణ రెడ్డి, ఖాదర్ భాష, ఏఎంసీ డైరెక్టర్ భీమాతాటి సుధాకర్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు తోట శోభా రాణి, టిడిపి నాయకులు అజయ్, కటకం చైతన్య, రియాజ్, రాఘవ, సతీష్, రూపక్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీ మల్లికార్జున స్వామి కామాక్షితాయి దేవస్థానం, జొన్నవాడ క్షేత్రం,



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 20.
పొదలకూరు వాస్తవ్యులు చి॥ శ్రీ కర్ణం కామాక్షి ఆర్య పేరున శ్రీ కర్ణం కామాక్షి కార్తిక్ శ్రీ స్వామి అమ్మవార్ల పై భక్తి తో నిత్య ఆర్జిత సేవల్లో ఉపయోగించిటకు సుమారు 94 గ్రాములు విలువైన వెండి వింజామర దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి శ్రీ అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా దాత గోత్రనామములతో శ్రీ మల్లికార్జున స్వామి వారికి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదములు అందజేశారు. తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్ మరియు ధర్మకర్త మండల సభ్యులుఅర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డిసహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి

# 23 నుండీ అంగన్వాడీల రిలే నిరాహార దీక్షలు



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 20,
రాష్ట్రప్రభుత్వం గతంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని,ప్రస్తుత బడ్జెట్లో అంగన్వాడీలకు తగిన కేటాయింపులు ఇవ్వాలని ఈనెల 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు శుక్రవారం పలమనేరు ప్రాజెక్టు సిడిపిఓ ఉమారాణికి సిఐటియు,ఏఐటీయూసీ,ఐఎఫ్టియు అనుబంధ అంగన్వాడి సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్తా మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రస్తుత ప్రభుత్వ మంత్రులు, ముఖ్యమంత్రి అంగన్వాడీల సమస్యలను మేము అధికారంలోకి వస్తే వెంటనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.కానీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకూ ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు.గతంలో 42 రోజులు సమ్మె సందర్భంగా చేసిన పోరాట ఫలితంగా మినిట్స్ కాపీ ఇచ్చి కొన్ని సమస్యలు పరిష్కారం చేస్తామని చెప్పారు.అవి కూడా అమలు చేయక పోవడంతో వాటికోసం మళ్లీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత పెద్ద ఎత్తున పోరాటం చేయడం జరిగింది. పోరాటానికి స్పందించి ప్రభుత్వం కొన్ని సమస్యలు పరిష్కరించినప్పటికీ వేతనాలు పెంచకపోవడం దారుణం అన్నారు. వెంటనే వేతనాలు పెంచాలని,మిగిలి పోయిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని,వేసవి సెలవులు మే నెల మొత్తం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాటివిటీ అమలు చేయాలని, హెల్పర్ల ప్రమోషన్ లో రాజకీయ జోక్యం ఉండరాదని, లబ్ధిదారులకు సరఫరా చేసే బియ్యం,పప్పు, నూనె ఇతర వస్తువులు క్వాంటిటీ పెంచాలని సమస్యలు పరిష్కారం కోసం ప్రాజెక్ట్ స్థాయిలో రిలే నిరాహార దీక్షలు చేపట్టి అప్పటికే పరిష్కారం కాకపోతే జిల్లా స్థాయిలోనూ తర్వాత మార్చి 2న విజయవాడలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.ఈ నిరాహార దీక్షలలో అంగన్వాడీ లందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘం నుండి లత, ఏఐటియుసి అనుబంధ సంఘం నుండి శాంతి, ఐఎఫ్టియూ అనుబంధ సంఘం నుండి కె.లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు

# దేవస్థాన నిత్య అన్నదానం టికెట్ కౌంటర్ నిర్వహణ కొరకు కంప్యూటర్ బహుకరణ




బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 20.
దేవస్థాన నిత్య అన్నదానం టికెట్ కౌంటర్ నిర్వహణ కొరకు కంప్యూటర్ బహుకరణ అన్నదానం సేవలకు సంబంధించిన టిక్కెట్ల జారీ, దాతల నమోదు, రశీదుల జారీ వేగవంతంగా నిర్వహించుటకు అమ్మవారి పై భక్తి తో ఎన్ డి సి సి బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శ్రీ సూరపనేని శ్రీనివాస రావు అడ్వాన్స్ ఫీచర్స్ కలిగిన కంప్యూటర్ ను దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జనరల్ మేనేజర్ వై సరిత పొదలకూరు బ్రాంచ్ సహాయ జనరల్ మేనేజర్ శనగవరపు శ్రీనివాస భగవాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు గోత్రనామములతో శ్రీ మల్లికార్జున స్వామి శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదములు అందజేశారు.
తిరుమూరు అశోక్ రెడ్డి చైర్మన్
మరియు ధర్మకర్త మండల సభ్యులు
అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి
సహాయ కమీషనరు
మరియు కార్యనిర్వహణాధికారి

# జట్టి శ్యామసుందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రసన్న కుమార్ రెడ్డి



కోవూరు పెన్ పవర్ ఫిబ్రవరి 20.
కోవూరు మండలం పడుగుపాడు గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు జెట్టి శ్యామసుందర్ రెడ్డి వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మాతృమూర్తి జట్టి పుష్పావతి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పుష్పావతి ఆరోగ్యం విషయం లో అప్రమత్తం గా ఉండాలని సూచించిన..
మాజీ మంత్రివర్యులు వైసీపీ రాష్ట్ర పి ఏ సి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి
వారి వెంట..వైసీపీ నాయకులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి శివుని నరసింహారెడ్డి రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి , అత్తిపల్లి అనుప రెడ్డి వరగిరి శ్రీలత , గోపిరెడ్డి భాస్కర్ రెడ్డి , కవరగిరి ప్రసాద్ , బలంరెడ్డి చెంచు రెడ్డి కిషోర్ రెడ్డి , చింతంగారి గోవిందు మస్తానయ్య , గుండపనేని రవి తలపల శ్రీనివాసులు పాలపర్తి రమేష్ సరాబు సుదీర్ షేక్ ఖాజావలి , తప్పెట్ల భాస్కర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పార్కింగ్ చేసిన కారును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పపెట్టి దగ్ధం చేశారు

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 20.
బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని బెల్దారి పాలెం వీధిలో ఘోర ఘటన చోటుచేసుకుంది.పార్కింగ్ చేసి ఉన్న కారును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి దగ్ధం చేశారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం, కారును కావాలనే ఎవరో దుండగులు తగలబెట్టినట్లు అనుమానిస్తున్నారు. బుచ్చిరెడ్డిపాలెం పరిధిలో ఇలాంటి ఘటనలు జరగడం పట్ల స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. క్రైమ్ బెల్దారిపాలెం వీధిలో అసలు ఆ కారును ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారు? పాత కక్షలు ఏవైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ జరగాల్సి ఉంది.



# మండల అధ్యక్షుడు డి మాధవరావ ఆధ్వర్యంలో



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 20.
బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు స్వామివారు నగర వీధుల్లో రథంపై తిరుగుతారు. ఆ రథయాత్రలో పాల్గొన్న భక్తులకు బుచ్చిరెడ్డిపాలెం మండల అధ్యక్షుడు డి.మాధవరావు బుచ్చి మండల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పండ్ల రసాయనాన్ని అందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన కోవూరు నియోజికవర్గ ఇంచార్జ్ చప్పిడి శ్రీనివాసులు రెడ్డి పాల్గొని స్వామివారి దర్శించి కోవూరు నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ దేవున్ని వేడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాలెం మండల కమిటీ సభ్యులు పసుపులేటి సురేష్ సిద్ధ సాయి అభి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు నాయుడు ఆహ్వానం పలికిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

నెల్లూరు పెన్ పవర్ ఫిబ్రవరి 20.
ఏ ఐ సమ్మిట్ లో పాల్గొన సీఎం అనంతరం వివిధ సంస్థల ప్రతినిధులతో భేటీ అంతర్జాతీయ స్థాయిలో ఢిల్లీలోని భారత్ మండపంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 లో పాల్గొనేందుకు ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీ లోని ఇందిరా గాంధీ విమానాశ్రయానికి చేరుకున్న సీఎం కు ఎంపీ ఆహ్వానం పలికారు. ఏ ఐ క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ అంశాల్లో ఏపీకి పెట్టుబడులు, సంస్థలు సాధించేలా సీఎం చంద్రబాబు పర్యటన సాగనుంది. రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు నైపుణ్యాలు కల్పించేలా ప్రతిష్టాత్మక ఐటీ సంస్థ ఐబీఎంతో ప్రభుత్వం ఒప్పందం చేసుకోనుంది. ఏపీలో క్వాంటం ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం ఎన్ఐఈఎల్ఐటీ తోనూ రాష్ట్ర ప్రభుత్వం




ఎంఓయూ చేసుకోనుంది. ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రం ఏర్పాటు కోసం యూనిసీసీ సంస్థతోనూ ఒప్పందం జరుగనుంది. ఎన్విడియా భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రకటన, అనంతరం క్వాంటెలా ఇంక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాంధీతోనూ సమావేశం, వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహించే రౌండ్ టేబుల్ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. ఏఐ సమ్మిట్ వేదిక వద్దే యునైటెడ్ కింగ్ డమ్ కు చెందిన ప్రతినిధి బృందంతోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ కానున్నారు. అనంతరం అరామ్కో ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ రెహమాన్ అయితుకైర్, అడోబ్ సీఈఓ శాంతను నారాయణ్, ఆటోడెస్క్ ఏఐ హెడ్ మైక్ హాలే తో ముఖ్యమంత్రి వేర్వేరుగా సమావేశం కానున్నారు.

# స్వగ్రామానికి విచ్చేసిన నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి




బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 20. బ్రహ్మరథం పట్టిన గ్రామస్థులు
ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సతీమణి మేకపాటి శాంతి కుమారి నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ గా నియమితులై మొదటిసారి స్వగ్రామమైన కంపసముద్రం గ్రామానికి విచ్చేసిన సందర్భంగా ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు.

# తుమ్మచెట్లు కోసిన దొంగలపై చర్యలు తీసుకోని

# అటవీ అధికారులు !

## - ఆక్రమరవాణా చేస్తున్న వి.కోట డాన్ ఎవరు ?



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 20,
తుమ్మచెట్లు కోసిన దొంగలపై చర్యలు తీసుకోని అటవీ అధికారుల ప్రవర్తనపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారపార్టీ అండదండలతో బాటు ఇటు అటవీశాఖ అధికారుల మద్దతు పుష్కలంగా ఉన్న ఆ కింగ్ ఎవరో ఇప్పటికీ అంతు బట్టనీయకుండా జాగ్రత్తలు పడుతున్నారని అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
వి.కోట మండల పరిధిలోని చింతల ఎల్లాగరం చెరువులో 50 సంవత్సరాల క్రితం చెరువు అన్యాక్రాంతం కాకూడదనే సదుద్దేశంతో అప్పటి ప్రభుత్వం చెరువులో తుమ్మచెట్లను నాటడం జరిగింది.కాలక్రమంలోఅవి మహావృక్షాలుగా పెరిగాయి.దీంతో వీటిపై కన్నేసిన ఆ అక్రమార్కులు సమయం కోసం వేచిచూశారు.అయితే ఇటీవల తెలుగుదేశం ప్రభుత్వం సుజల స్రవంతి పథకంలో భాగంగా చింతల ఎల్లాగరం చెరువుకు హంద్రీ-నీవా ద్వారా నీటిని మళ్ళించారు. వాటిలో ఉన్న చెట్లను ఎలాగైనా మాయం చేయాలని ప్రస్తుత ప్రభుత్వంలోని ఒక ప్రజా ప్రతినిధి కలప అక్రమ రవాణా డాన్ ఇద్దరు కలిసి పథకం రచించి పది రోజులు కష్టించి,సరైన నంబర్లు లేని పది ట్రాక్టర్లు,రెండు జెసిబిలు,ఒక హిటాచి సహాయంతో అక్కడున్న భారీ తుమ్మచెట్లను కోసి తమిళనాడుకు తరలించి లక్షల్లో కాజేశారు.ఇదే విషయమై కలప అక్రమ రవాణా దారుడైన చల్లపల్లికి చెందిన చంద్రను వివరణ కోరగా.. కుప్పం ఫారెస్ట్ అధికారులకు ఒక లక్షా 40 వేలరూపాయలు చెస్ చెల్లించామని, అదేవిధంగా కొంగాటంకు తాగునీటి పైప్ లైన్ ఒక లక్షతో వేయిస్తామని తెలపడం జరిగింది,కానీ అటు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఒక లక్ష 40వేల రూపాయలు గాని ఇటు కొంగాటం గ్రామానికి తాగునీటి కోసం పైప్ లైన్ వేసిన దాఖలాలు కనిపించడం లేదు.ఈ అవినీతి, అక్రమంపై అన్ని వార్తాపత్రికలలో వార్తలు వచ్చినా ప్రభుత్వం మాది మమ్మల్ని ఏమి చేయలేరు అనే ధీమాతో కలప అక్రమ రవాణాదారుడు మరియు అతనికి సహకరిస్తున్న ప్రజా ప్రతినిధి సైతం ఓవిలేకరిని బెదిరించడం జరిగింది.ఇది ఎంతవరకూ సమంజసం,కావున ఉన్నత అధికారులు



స్పందించి జరిగిన అక్రమకలప రవాణాపై సమగ్ర విచారణ చేయకపోతే అటవీ శాఖమంత్రి పవన్ కళ్యాణ్ వద్దకు వెళ్లి జరిగిన నష్టాన్ని సవివరంగా వివరించి కలప అక్రమ రవాణా దారునిపై హైకోర్టులో కేసు వేస్తామని ఆ కొంగాటం పంచాయతీ ప్రజలు విలేకరుల సమక్షంలో హెచ్చరించారు.

# ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

గూడూరు, పెన్ పవర్,ఫిబ్రవరి,20:
ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు, విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ గూడూరు ఆర్టీసీ డిపో వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు.విద్యుత్ బస్సుల నిర్వహణ పేరుతో ఆర్టీసీకి చెందిన విలువైన స్థలాలను ప్రైవేట్ సంస్థ అయిన పిన్నకిల్ ప్రైవేట్ కంపెనీ కు అప్పగించడం ప్రజా రవాణా రంగానికి నష్టదాయకమని నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ విద్యుత్ బస్సుల వల్ల ఆర్టీసీ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లే అవకాశం ఉందని, భవిష్యత్తులో ఉద్యోగుల భద్రతకూ ముప్పు ఏర్పడుతుందని వారు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే. శ్రీనివాసులు మాట్లాడుతూ, ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో ప్రైవేటీకరణ చర్యలు సరికాదన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే పునర్విమర్శించాలని ఆయన డిమాండ్ చేశారు.




ఈ ధర్నా కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు, కార్యదర్శి, సహాయ కార్యదర్శి, ప్రచార కార్యదర్శి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వసంతోత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక శోభ






శ్రీకాళహస్తి ,పెన్ పవర్ ,ఫిబ్రవరి, 20 :
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం శ్రీ స్వామి అమ్మవార్ల వసంతోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఆలయ వేదిక భక్తుల గోవిందనామస్మరణలతో మార్మోగిపోగా, వేదమంత్రాల నాదం మధ్య అర్చకులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సువాసనలతో అలంకరించిన మండపంలో స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. వసంతోత్సవం దర్శించిన భక్తులు అపార ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, స్వామి వారి కృపతో సర్వలోకక్షేమం కలగాలని ప్రార్థించారు.ఈ వసంతోత్సవం బ్రహ్మోత్సవాలకు మరింత వైభవాన్ని చేకూర్చింది.



# స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరండి

## -గైడ్స్ విద్యార్థుల ర్యాలీ

శ్రీకాళహస్తి ,పెన్ పవర్, ఫిబ్రవరి, 20 :
శ్రీకాళహస్తి: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరి సమాజిక సేవకులుగా మారాలని కాసా గార్డన్ వద్ద ఉన్న గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలకు చెందిన గైడ్స్ విద్యార్థినులు (ఔర్ ఫ్రెండ్షిప్ ) ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయ కమీషనర్ టి. రమేష్ బాబు, పాఠశాల గైడ్ కెప్టెన్ కుసుమ కుమారి, యూత్ చైర్మన్ ఎస్ కె అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్లు సుబ్రహ్మణ్యం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## గుండాల శ్యామ్ ప్రసాద్ రెడ్డికి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ నివాళి

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 20:
వాకాడు మండలం బాలిరెడ్డి పాలెం గ్రామంలో స్వర్గస్తులైన పార్టీ నాయకులు గుండాల శ్యామ్ ప్రసాద్ రెడ్డి భౌతికకాయానికి ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్యామ్ ప్రసాద్ రెడ్డి పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తరువాత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులు అర్పించారు

# సీతారామయ్యచే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 20,
పట్టణానికి చెందిన నాగమణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీపురం సీతారామయ్యచే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.గంగవరం మండలం కల్లుపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన వార్షికోత్సవం సందర్భంగా చదువుల్లో అత్యంత ప్రతిభ చూపిన 45మందికి మొదటి,మరియు రెండవ ప్రోత్సాహక బహుమతులు ఇచ్చి ప్రోత్సాహించారు.చదువుల్లో బాగా రాణించి పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు,గురువులకు మంచి పేరు తేవాలని ఆయన కోరారు.ఇందు నాయకులు రామ్మోహన్ నాయుడు,ప్రధానఉపాధ్యాయులు బాలచైతన్య,ఉపాధ్యాయులు రామన్న, విశ్రాంత ఉపాధ్యాయులు వీరభద్రగౌడ్,చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి.

తిరుపతి, పెన్ పవర్,ఫిబ్రవరి 20.
తిరుపతి నగరంలోని కరకంబాడి రోడ్డులో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందింది. అలిపిరి పోలీసుల వివరాల మేరకు...... కరకంబాడిలో నివాసముంటూ మహిళ రుయా ఆసుపత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తుంది,శుక్రవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కరకంబాడి రోడ్డు లోని సుబ్బారెడ్డి నగర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొనడంతో ప్రమాదానికి గురైంది. ప్రమాదానికి గురైన మహిళను ఆసుపత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న మృతిచెందిన మహిళ భర్త కృష్ణ చైతన్య విషయం తెలుసుకొని రుయా ఆసుపత్రికి చేరుకొని బోరున గెలిపించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతదేహానికి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించి మృతురాలు బంధువులకు అప్పజెప్పారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు అలిపిరి ఎస్సై నరసింహారావు. కాగా మృతురాలు బంధువులు, మృతురాలి తో పనిచేస్తున్న తోటి సిబ్బంది మార్చురీ వద్దకు చేరుకొని కంటతడి పెట్టారు.



# ఉరివేసుకుని మహిళ మృతి.

తిరుపతి,పెన్ పవర్,ఫిబ్రవరి 20.
ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొర్లగుంటలోని మారుతి నగర్ లో ఓ వివాహిత ఉరివేసుకుని మృతి చెందిన ఘటన శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. తిరుపతి ఈస్ట్ ఎస్ఐ స్వాతి వివరాల మేరకు...... మూడు సంవత్సరాల క్రితం దివ్య ప్రకాష్ వివాహమైందని వీరికి సితార 18 నెల సంతానం, కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా చిన్నపాటి గొడవలు జరుగుతున్నట్లు తెలిపారు, గొడవల కారణంగా మనస్థాపం చెందిన దివ్య (20) నివాసమున్న ఇంటిలోనే ఉరి వేసుకుని మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలిని పోస్ట్ మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



# ఇంటి పన్ను వసూల్లో గంగవరం మండలం ప్రథమ స్థానం

## -ఎంపీడీవో లక్ష్మణరావు

గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 20:
ఇంటి పన్ను వసూలులో పోలవరం జిల్లాలో గంగవరం మండలం ప్రథమ స్థానం సాధించిందని ఎంపీడీవో లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. మండలంలోని 60 గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, రహదారులు మెరుగుపడితేనే గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారు.మండల స్థాయి అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నారని వెల్లడించారు. ప్రభుత్వ పథకాలు, సర్వేలు విజయవంతంగా అమలవుతున్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.మండలంలో అమలవుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సందర్భంగా ఎంపీడీవో వివరించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర, ఏపీఎం అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు



# జగన్ రెడ్డి హైందవ సమాజ ద్రోహి:

## -డా. యం. ఉమేష్ రావు తీవ్ర ఆరోపణలు



శ్రీకాళహస్తి , పెన్ పవర్ ,ఫిబ్రవరి, 20 :
వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి హైందవ సమాజానికి ద్రోహిగా వ్యవహరిస్తున్నారని తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం. ఉమేష్ రావు తీవ్రంగా ఆరోపించారు. పవిత్రమైన శ్రీవారి లడ్డూ కల్తీ అంశాన్ని కప్పిపుచ్చుకునేందుకు వేంకటేశ్వర స్వామి చిత్రాలను అపవిత్రం చేస్తూ మరో మహాపరాధానికి పాల్పడ్డారని ఆయన విమర్శించారు.శాసన మండలిలో శ్రీ వేంకటేశ్వర స్వామి చిత్రపటాలను అవమానించిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ దేవతలను అవమానించడమే లక్ష్యంగా వైసీపీ నేతలు దుష్ట రాజకీయాలు చేస్తున్నారని, ఈ ఘటనపై జగన్ రెడ్డి మరియు సంబంధిత సభ్యులు హిందువులకు క్షమాపణ చెప్పాలని కోరారు."కల్తీ చేసిన నేరస్తులపై చర్చించకుండా స్వామి విషయాన్ని ప్రస్తావనలోకి తేవడం ఎందుకు?" అని ప్రశ్నించారు. చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫోటోలు పట్టుకుని రావడం అనైతికమని తెలిసినా వైసీపీ సభ్యులు కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించారని ఆరోపించారు.
అలాగే హెరిటేజ్ ఫుడ్స్‌పై సాక్షి మీడియా చేస్తున్న దుష్ప్రచారానికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో పరువు నష్టం దావా వేయగా, కోర్టు ఆ ప్రచారాన్ని ఫేక్‌గా పేర్కొంటూ సంబంధిత వార్తలు, పోస్టుల లింకులను 24 గంటల్లోగా తొలగించాలని ఆదేశించిందని తెలిపారు. ఈ అంశం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే వైసీపీ నేతలు శాసనమండలిలో అనుచిత చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు.తిరుమల సందర్శన సమయంలో కూడా చెప్పులతో ఆలయ ప్రాంగణంలో తిరిగిన ఘటనను ప్రస్తావిస్తూ జగన్ రెడ్డి, వైసీపీ నేతలు తమ తప్పులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. చివరగా, వెంకన్న స్వామి తగిన విధంగా వారికి బుద్ధి చెప్పాలని ప్రార్థించారు.
ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, పట్టణ నాయకులు వజ్రం కిషోర్, కోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# హోటళ్ళ కేటాయింపులో పారదర్శకత ఏది...?

## - ఆన్లైన్ విధానం నుండి ఆఫ్లైన్ విధానం ఎందుకు....!
## - స్థానికులకు ఇవ్వకుండా సంబంధీకులకే కట్టపెట్టడంలో అంతర్యం ఏమిటి..?
## - 8 నెలల కాలయాపనతో టిటిడి కి 16 కోట్ల నష్టం.

తిరుమల,పెన్ పవర్,ఫిబ్రవరి 18.
తిరుమలలో హోటళ్ల లైసెన్సులు మంజూరు విషయంలో తిరుమల తిరుపతి దేవస్థానం పారదర్శకత ఏదని ప్రశ్నించారు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి. తిరుపతి ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమలలో స్థానికులను ఎవరిని అర్హులుగా గుర్తించకూడదనే ధోరణితో టీటీడీ నిబంధనలను మార్చి, పొందుపరిచిన నిబంధనలు పాటించని వారిని అక్రమ పద్ధతిలో ఎంపిక చేయడం జరిగిందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ పద్ధతిలో లైసెన్సులు దక్కించుకున్న 5 బిగ్ క్యాంటీన్లు, 5 జనతా క్యాంటీన్లు నేటికీ ఉపయోగంలోకి రాకపోవడంతో ఇటు భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమవారికి హోటల్లోను కట్టబెట్టాలని కుట్రతో ఆన్ లైన్ టెండర్ల విధానాన్ని రద్దుచేసి ఆఫ్ లైన్ ద్వారా తాము అనుకున్న వారికి కేటాయించుకున్నారు. పెద్ద పెద్ద సంస్థలు టీటీడీ హోటళ్ల టెండర్ల ప్రక్రియలో పాల్గొన్నారని, అయితే 31 మందిని అర్హులుగా ప్రకటించిన అధికారులు, 26 మందిని అనర్హులుగా ప్రకటించి, మిగిలిన 5 మందిని అర్హులుగా చూపి వారికి డిప్ పద్ధతిలో తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో హోటల్లో ఎంపిక ప్రక్రియను ప్రకటించారన్నారు. దీనిపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో గడిచిన ఎనిమిది నెలల కాలంగా ఈ హోటల్లు ప్రారంభం కాలేదని, దీని ద్వారా టిటిడికి రూ.20 నుంచి రూ.25 కోట్ల రూపాయలు నష్టం వచ్చిందని అన్నారు. టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా తిరుమలలో టీటీడీ కేటాయించిన స్థలంకు మించి ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరిగాయని, దీనిని స్వయంగా టిటిడి ఇంజనీరింగ్, రెవిన్యూ విభాగాల అధికారులు స్వయంగా పరిశీలించిన దాఖలాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఎంపిక కాబడిన హోటళ్లకు బినామీగా టిటిడి ఉన్నతాధికారి మిత్రులొకరు, టిటిడి బోర్డు బంధువు కూడా ఉన్నారని ఆరోపించారు. పెద్ద పేరున్న సంస్థల పేరిట లైసెన్సు పొందిన వారికి టీటీడీ పొందుపరిచిన అర్హతలు లేవని, అటువంటి వారికి ఈ హోటల్లో టెండర్ ప్రక్రియలో హోటళ్ల కేటాయింపు




జరిగిందన్నారు. స్థానికులు అర్హత సాధించకపోవడానికి ఉన్న కారణాలపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి ప్రజలకు చెప్పాలన్నారు. ఈ టెండర్ ప్రక్రియను రద్దుచేసి రీ టెండర్లు పిలిచి ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇక సన్నిధానం బిగ్ క్యాంటీన్ వ్యవహారమైతే టీటీడీ నష్టపోతున్న కానీ ఆ బిగ్ క్యాంటీన్ నిర్వాహకులపై ఎనలేని ప్రేమ చూపుతున్నారన్నారు. సన్నిధానం బిగ్ క్యాంటీన్ నిర్వాహకులు టీటీడీ నిబంధనలను పూర్తిగా వ్యతిరేకించి టిటిడి కేటాయించిన స్థలానికి ఆనుకుని ఉన్న భూభాగాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడం, ఎన్నో ఏళ్ల నాటి చరిత్ర కలిగిన వృక్షాలను తొలగించారని, వీరి లైసెన్సును రద్దు చేయాలని టిటిడి అధికారులు ధర్మకర్తల మండలికి చేసిన సిఫార్సులకు గత ఏడాది అక్టోబర్ 28వ తేదీన టిటిడి బోర్డు రిజల్యూషన్ నెంబర్ 473లో టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు సన్నిధానం బిగ్ క్యాంటీన్ నిర్వాహకులపై అమితమైన ప్రేమ చూపుతూ ఇలా చేయకండి మీరు బకాయి ఉన్న రూ.3.25 కోట్ల రూపాయలు టీటీడీ నిబంధనల ప్రకారం చెల్లించాలని చెప్పి సున్నితంగా పరిష్కారం చూపారని, టీటీడీకి ఇంత నష్టం జరుగుతుంటే కాపలా కుక్కలుగా ప్రకటించుకున్న వారు టీటీడీ బోర్డులో ఉంటూ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. పైగా సన్నిధానం బిగ్ క్యాంటీన్ టీటీడీకి ఉన్న బకాయిలకు సంబంధించి, ముఖ్యమంత్రి నుండి లేక వచ్చిందని, అధికారులు సన్నిధానం బిగ్ క్యాంటీన్ నిర్వాహకులకు వేసిన ఫైన్స్ ను చెల్లించనవసరం లేకుండా టీటీడీ చైర్మన్ బి.ఆర్ నాయుడు టీటీడీకి నష్టం వస్తోందని తెలిసిన సన్నిధానం బిగ్ క్యాంటీన్ వారికే మద్దతు ఇచ్చారని, దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి తగిన విచారణ జరపాలన్నారు. టీటీడీకి సంబంధించి తాను పారదర్శకంగా వ్యవహరిస్తానని, టీటీడీ నుండి ఒక రూపాయి కూడా ఆశించబోనని ప్రగల్భాలు పలికే బి ఆర్ నాయుడు ఇన్ని లక్షల రూపాయలు టీటీడీకి నష్టం వచ్చింది అని అధికారులు చెప్పినా కూడా ఎవరి మెప్పుకోసం సన్నిధానం బిగ్ క్యాంటీన్ వారికి చైర్మన్ వత్తాసుగా నిలుస్తున్నారో దీనిపై ప్రభుత్వం విచారణ చేపట్టాలన్నారు. టీటీడీ అంటే అంత ఎంత అని మాట్లాడే సీఎం చంద్రబాబు, హోటళ్ల టెండర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై, సన్నిధానం బిగ్ క్యాంటీన్ పై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వద్దనైనా ధర్మంగా, నిజాయితీగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్ తో కలిసి మాట్లాడారు.

# అలరించిన నృత్య ప్రదర్శన తన్మయత్వంలో భక్తులు





శ్రీకాళహస్తి, పెన్ పవర్, ఫిబ్రవరి,20 :
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాజగోపురం వెనుక స్వర్ణముఖి నది ఒడ్డున ఏర్పాటుచేసిన ధూర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతికకార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరిస్తున్నాయి.ఈనేపథ్యంలో దేవస్థానంకూడా స్థానికులకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు.గురువారం శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరాం నగర్‌కాలనీకి చెందిన ఎం.ఆర్. ప్రభాకర్,ఎం.ఆర్.
దేవిల కుమార్తె యం.మౌనిషా బిటెక్ చదువుతోంది.ఆషా నాట్య కళా నిలయంలో ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మౌనిష ధూర్జటి కళా ప్రాంగణంలో మౌనిషా పౌర్ణమి చిత్రంలోని
'భరత వేదముగ,డమరుకం చిత్రంలోని 'శివ శివశంకర', భరత నాట్యం,పాటలకు ఎంతో చక్కగా నృత్యం చేయడంతో పలువురు భక్తులను ఆకట్టుకుంది.చిన్నారి ప్రదర్శనకు భక్తులు మంత్రముగ్ధులయ్యారు.అనంతరం చిన్నారి మౌనిషాకు ధూర్జటి కళాప్రాంగణం ఇన్చార్జి ఆధ్వర్యంలో మెమొంటోతో పాటు ప్రశంసాపత్రంను అందించి దేవస్థానం కండువాతో సత్కరించారు.

# వినియోగదారులకు వస్తువులు కొనుగోలుపై అవగాహన అవసరం-డీఎస్పీ చెంచుబాబు

## - వినియోగదారులు హక్కుల పరిరక్షణ ఫారం పోస్టర్ ఆవిష్కరణ

నాయుడుపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 20
వినియోగదారులకు వస్తువుల కొనుగోళ్లపై అవగాహన అవసరమని నాయుడుపేట డిఎస్పి చెంచు బాబు అన్నారు.శుక్రవారం ఆయన నాయుడుపేట పోలేరమ్మ ఆలయం వద్ద వినియోగదారులు హక్కుల పరిరక్షణ ఫారం అవగాహన పోస్టర్ ను ఆవిష్కరించారు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సందర్భాల్లో వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసి మోసపోతున్నారని అన్నారు.తక్కువ ధరకే వస్తువులు పై ఆశ పడి నాణ్యత లేని వస్తువులు కొనుగోలు చేయవద్దని సూచించారు.వస్తువులు కొనుగోలు సమయంలో నాణ్యత,తయారీ తేదీ,తూకం,తదితర విషయాలు గమనించి వస్తువులు కొనుగోలు చేయాలన్నారు. మాల్స్ లో వస్తువులు, బిల్లు లను పరిశీలించి కొనుగోలు చేయాలని తెలిపారు.పెట్రోల్ బంకు లో సైతం వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వినియోగదారులు హక్కుల పరిరక్షణా ఫారం ఉపాధ్యక్షులు యన్ ఏవీ కుమార్ డీఎస్పీ చెంచుబాబుకు శాలువాతో సన్మానించి మెమెంట్ అందజేశారు. అనంతరం పోలేరమ్మ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నానాబల సుబ్బారావు,ఆకుల కుబేర మణి, రాగి శేషగిరి,మదిరి చిట్టిబాబు, నైనప్పగారి వేంకటేశ్వర్లు,గురునాదం,కృష్ణా రెడ్డి,ముత్యాలయ్య,చిగురాలకు. సురేంద్ర,ప్రసాద్,మురళి, యుగంధర్,సురేష్,జి సోము తదితరాలు పాల్గొన్నారు.







# ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని సన్మానించిన టిడిపి నేతలు

నాయుడుపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 20
సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్యే సోమిరెడ్డి శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి విచ్చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి శాలవాలు కప్పి సాదర స్వాగతం పలికారు.అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సోమిరెడ్డికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,తెలుగుదేశం పార్టీ నాయకులు పసల గంగా ప్రసాద్,మైలారి రాజశేఖర్,గాలి రమేష్ నాయుడు,గూడూరు సుధీర్ రెడ్డి,నిత్యా కృష్ణారెడ్డి,బల్లి ముత్యాలయ్య,పలువురు నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు

# రైల్వే స్టేషన్లో గుర్తుతెలియని మహిళ మృతి.

తిరుపతి,పెన్ పవర్, ఫిబ్రవరి 20.
ప్రముఖ పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరంలోని రైల్వేస్టేషన్లో ఓ గుర్తు తెలియని 60,65 ఏళ్ళ వయసు ఉన్న మహిళ శుక్రవారం మృతి చెందినది. విషయం తెలుసుకున్న తిరుపతి రైల్వే స్టేషన్ అధికారులు రైల్వే పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు దీంతో రుయా మార్చురీ కి మృతదేహాన్ని తరలించి భద్రపరిచారు. మహిళకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని మహిళగా గుర్తించిన పోలీసులు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేసు నమోదు చేసిన రైల్వే హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ రెడ్డి మృతురాలని ఎవరైనా గుర్తించిన ఎడల రైల్వే పోలీసుల సంప్రదించాలంటూ తెలిపారు





# ఎమ్మెల్యే సోమిరెడ్డిని సన్మానించిన టిడిపి నేత వేలూరు మురళికృష్ణారెడ్డి..

నాయుడుపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 20

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు వేలూరు మురళీకృష్ణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్యే సోమిరెడ్డి శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి విచ్చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి శాలవాలు కప్పి సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా వేలూరు మురళీ కృష్ణారెడ్డి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,తెలుగుదేశం పార్టీ నాయకులు పార్థసారథి,పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్,వేలూరు మురళీకృష్ణ రెడ్డి,సంచి కృష్ణయ్య,పలువురు నాయకులు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

# మండలాల డీలర్లు సమావేశం

బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 20.

బుచ్చి రెడ్డిపాలెం మండల పరిధిలోని చౌక దుకాణం డీలర్లకు (నెలవారి సరుకులు) ప్రజా పంపిణీ విషయమై తేదీ. 20.02.2026న తహసిల్దారు వారు ఇచ్చిన సూచనలు మరియు సలహాలు విషయమై నిర్వహించిన సమావేశము.





# రేషన్ బియ్యం మాఫియాను అరికట్టలేరా ..

## - మాఫియాకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు లెక్కడ ?

పలమనేరు,పెన్ పవర్, ఫిబ్రవరి 20, ప్రతి నిత్యం జరుగుతున్న రేషన్ బియ్యం రవాణాకు పాల్పడుతున్న మాఫియాను అరికట్టలేరా అని,అలాగే ఈ మాఫియాకు సహకరిస్తున్న అధికారులపై చర్యలెక్కడని ప్రజలు గట్టిగా ప్రశ్నిస్తున్నారు.నియోజకవర్గ పరిధిలోని వి.కోట మండల కేంద్రం అంతరాష్ట్ర సరిహద్దు కావడంతో తమిళనాడు నుండి రేషన్ బియ్యాన్ని ఇటు ఆంధ్ర రేషన్ బియ్యాన్ని యదేచ్ఛగా ప్రక్కన కర్ణాటక రాష్ట్రానికి చెందిన బంగారుపేటకు తరలిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారు. ఉదాహరణ ఇటీవలే కుప్పం సరిహద్దుల్లో భారీమొత్తంలో తమిళనాడు బియ్యాన్ని పట్టుకున్న కుప్పం పోలీసులు తూతూ మంత్రంగా కేసు నమోదు చేసి వదిలేసారు.అదేవిధంగా ఇటు గుడియాతం పేర్నంబట్టు నుండి యథేచ్ఛగా తమిళనాడు బియ్యం వస్తున్నా అధికారులు చూసీచూడనట్లు ఉండడంతో పలు అనుమానాలు కలుగుతున్నాయి.కానీ మండలంలో ఉన్న 18పంచాయతీల నుండీ మిగిలిన రేషన్ బియ్యాన్ని ఇక్కడ పేరుమోసిన అక్రమ కలప రవాణాదారుడు తరలిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారు.ఈ రేషన్ మాఫియాలో ప్రధాన పాత్రధారి సూత్రధారి మండలంలో ఒకే ఒక్కడు అతనే గతంలో కూడా వైసీపీలోని భరత్ కు ప్రధాన అనుచరుడు, ప్రస్తుతం తెలుగుదేశంలో ఎవరికి అనుచరుడో తెలుగుదేశం నాయకులకే తెలియాలి.కావున ఈ



ఊసరవెల్లి అయిన బియ్యం రవాణా దారుడు ఏ పార్టీ వచ్చినా వారికి కొమ్ము కాస్తూ తన అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోకపోతే హైకోర్టులో కేసులు వేస్తామని కొంతమంది మండల ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇటీవల కొంతమంది విలేకరులు వి.కోటలో అక్రమ బియ్యం రవాణా చేస్తున్న ఆండప్ప అనే అతను మిల్లుకు వెళ్ళగా అక్కడ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రవాణా చేసిన బియ్యపు మూటలు దర్శనమిచ్చాయే గాని అక్కడ వేరే బియ్యం లేకపోవడం శోచనీయం. కావున ఇతనికి సహకరిస్తున్న పార్టీ నాయకులు కావచ్చు అక్రమబియ్యం రవాణా దారులు కావచ్చు,ఈ అక్రమార్కునిపై చర్యలు తీసుకుని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో జరుగుతున్న బియ్యం మాఫియాను అరికట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు. ఇతను అక్రమ బియ్యం రవాణాను బంగారుపేటకు తరలించి ఇక్కడ 10 రూపాయలకు కొన్న బియ్యాన్ని అక్కడ 30 రూపాయలకు అమ్ముకోవడం శోచనీయం.ఎటువంటి అక్షరపరిజ్ఞానం



లేని ఆండెప్ప విలేకరులను శాసించే స్థాయికి వచ్చాడంటే అతని వెనక ప్రస్తుత రాజకీయ నాయకులు అండ దండలు పుష్కలంగా ఉన్నాయనే చెప్పవచ్చు. అతను కుప్పం ఎమ్మెల్సీ భరత్ ప్రధాన అనుచరుడు అనే సంగతి తెలుగుదేశం నాయకులకు తెలిసినా అతనిని తమ పార్టీలో కొంతమంది నాయకులు తాను చేస్తున్న బియ్యం అక్రమ రవాణాకు సహకరిస్తున్నారంటే వారికి ఏస్థాయిలో ముడుపులు ముట్టాయో అర్థం అవుతుంది.కావున బియ్యం మాఫియాను అరికట్టడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైతోంది.దానికి ప్రధాన కారణం వి.కోట అధికారపార్టీ నాయకులు,ఇందుకు అన్నిరకాల సహకారాన్ని అందిస్తున్న ఇక్కడ అధికారులదే కావడం విశేషం.ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి అక్రమాలకు కొమ్ముకాస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇంటికో మహిళా పారిశ్రామికవేత్త తయారు చేయడం సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యం





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ ఫిబ్రవరి 20.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం చుట్టి 25 ఏళ్లు పూర్తికావస్తుంది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా సంఘాల సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించుకోబోతున్నాం.ప్రతి ఇంటి నుండి ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పం. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిమహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే నవసమాజ నిర్మాణం సాధ్యం అవుతుందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బుచ్చిరెడ్డి పాలెం పట్టణంలో మెప్మా ఆర్థిక సహాయంతో స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శారీ రోలింగ్ సెంటర్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలకు శ్రీకారం 25 ఏళ్లు పూర్తికావస్తుండటం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా సంఘాల విజయాలను పురస్కరించుకొని సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగాజరుపుకోబోతున్నామని ఆమె వెల్లడించారు.నాడు చంద్రబాబు నాయుడు వేసిన డ్వాక్రా సంఘాల పునాది నేడు మహిళల ఆత్మగౌరవానికి మరియు ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఒకప్పుడు కేవలం ఇంటికే పరిమితమైన మహిళలు పొదుపు సంఘాలలో సభ్యులై నేడు స్వయం ఉపాధి రంగాల్లో రాణించడం మహిళా సాధికారతకు నిదర్శనం అన్నారు. ప్రతి ఇంటి నుండి ఒక మహిళా పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి సంకల్పమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. పొదుపు మహిళల ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డి పాలెంలో ప్రారంభించిన ఈ శారీ రోలింగ్ సెంటర్ దినదినాభివృద్ధి చెంది మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆదర్శం కావాలన్నారు. మెప్మా ద్వారా పొదుపు సంఘాలకు ఆర్థిక సహాయం అందించి వారు సొంతంగా వ్యాపారాలు చేసుకునేలా ప్రభుత్వం నిరంతరం ప్రోత్సహిస్తుందని హామీ ఇచ్చారు. మార్చి 8 నుంచి డ్వాక్రా మహిళల కోసం ప్రత్యేక రుణ పథకాలను ప్రభుత్వం అమలు చేయబోతోందని ప్రశాంతి రెడ్డి తెలిపారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్మన్లు శివకుమార్ రెడ్డి, పటాన్ నస్రీన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎం వి శేషయ్య, నగర అధ్యక్షులు శ్రీనివాసులు, జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, బుచ్చిరెడ్డి పాలెం పట్టణ కౌన్సిలర్లు మరియు తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు, మెప్మా అధికారులు పాల్గొన్నారు



# టిడిపి రేపల్లె కార్యాలయంలో ప్రజా దర్బార్

రేపల్లె పెన్ పవర్ ఫిబ్రవరి 20.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ ఏర్పాటు చేసినట్లు మంత్రి సత్య ప్రసాద్ సోదరుడు శివప్రసాద్ తెలిపారు టిడిపి రేపల్లె కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ లో శివప్రసాద్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు ప్రజలు ఇచ్చిన అర్జీలను మంత్రి సత్య ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కృష్ణ పశ్చిమ డెల్టా సాగునీటి సంఘాల చైర్మన్ పి మురళీధర్ రావు టిడిపి నాయకులు సూర్యరాజు మాజీ ఎంపీపీ విచారపు వీరయ్య నగరం మండల టిడిపి అధ్యక్షులు చింతల సుబ్బారావు వై ధర్మతేజ ఎన్ అజయ్ కుమార్ మంత్రి పిఏ సుబ్బారావు దేవగిరి రవిశంకర్ వెనిగళ్ళ శివ సుబ్రహ్మణ్యం ఎన్.వి. ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు




# నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఐడియా జనరేషన్ వర్క్‌షాప్

గూడూరు, పెన్ పవర్, ఫిబ్రవరి,20:

గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కాలేజీలోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఇ ఇ ఇ) విభాగం ఆధ్వర్యంలో, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్ సహకారంతో "ఐడియా జనరేషన్ అండ్ ప్రాబ్లం ఐడెంటిఫికేషన్ వర్క్‌షాప్" పేరుతో ఒక రోజు వర్క్‌షాప్‌ను ఈఈఈ సెమినార్ హాల్లో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి మరియు రిసోర్స్ పర్సన్‌గా మహ్మదీయ యూనివర్సిటీ కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. హేమంత్ కుమార్ హాజరై "క్వాలిటీ జర్నల్స్ అండ్ కాన్ఫరెన్సెస్" అంశంపై విద్యార్థులకు విశ్లేషణాత్మకంగా వివరించారు. పరిశోధన పత్రాల రచనలో పాటించాల్సిన ప్రమాణాలు, నాణ్యమైన జర్నల్స్ ఎంపిక విధానం, కాన్ఫరెన్సుల ప్రాముఖ్యత గురించి వివరంగా చర్చించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విశ్వక్ సేనారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు సంప్రదాయ ఉద్యోగాలకు మాత్రమే పరిమితం కాకుండా సృజనాత్మక ఆలోచనలతో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. మేనేజింగ్ సెక్రటరీ వై. వినయ్ కుమార్ మాట్లాడుతూ జర్నల్స్ పబ్లికేషన్స్ రంగంలో ముందుకు రావడానికి కళాశాల పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ బి. దత్తాత్రేయ శర్మ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ అభివృద్ధికి వినియోగించాలని విద్యార్థులకు సూచించారు.

ఇఈఈ విభాగాధిపతి మరియు ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ. జగదీష్, ఏ.ఓ కొండారెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ వర్క్‌షాప్ విద్యార్థుల్లో పేపర్ రైటింగ్ నైపుణ్యాల పెంపొందనకు, పేటెంట్లపై అవగాహన కల్పించడానికి ఉపయోగకరమైన వేదికగా నిలిచింది.



# మారేది లేదంటున్న కొలికపూడి

**విజయవాడ, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** కొలికపూడి తరచూ కాంట్రవర్సీకి కేరాఫ్ అవుతూ..పార్టీకి, క్యాడర్‌కు తలనొప్పిగా మారారన్న చర్చ జరుగుతోంది. వివాదాలే ఆయనను వెతుక్కుంటూ వస్తున్నాయో లేక ఆయనే కాంట్రవర్సీకి తెరలేపుతున్నారో తెలియదు కానీ..ఎమ్మెల్యే కొలికపూడి తీరు ఎప్పుడూ హాట్ టాపిక్ ఉంటోంది. పార్టీ తరఫున బలమైన వాయిస్ వినిపించి..అధికారంలోకి వచ్చాక ఆయనే సమస్యగా మారారన్న టాక్ వినిపిస్తోంది. అధికార పార్టీలో ఉండి..స్వపక్షంలో విపక్షంలా సొంత ఎజెండాతో, తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఎప్పుడూ ఏదో ఒక వివాదానికి తెరలేపుతూ తాను చిక్కుల్లో పడటమే కాదు..పార్టీని కూడా ఇరకాటంలో పడేస్తున్నారు.ఎంపీ కేశినేని చిన్నితో వివాదం..వాట్సప్ స్టేటస్‌లతో రచ్చరచ్చ చేశారు. టీడీపీ పెద్దలు పలుసార్లు ఆయనను పిలిచి మాట్లాడారు. అధిష్టానం సీరియస్ కావడంతో అప్పుడప్పుడు సైలెంట్ అవుతున్నారు. తనకేం తెలియదు..ఏ కాంట్రవర్సీతో ఏ సంబంధం లేదన్నట్లుగా బిహేవ్ చేస్తున్నారు. సడెన్‌గా మళ్లీ ఏదో ఒక వాట్సప్ పోస్ట్, స్టేటస్‌తో వార్తల్లో నిలుస్తున్నారు కొలికపూడి.పరోక్షంగా ప్రభుత్వ పనితీరును విమర్శిస్తున్నట్లు వాట్సప్ స్టేటస్ పెట్టిన ఎమ్మెల్యే కొలికపూడి అధిష్టానం నుంచి చీవాట్లు తిన్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు పల్లె కన్నీరు పెడుతోంది అంటూ కొలికపూడి పెట్టిన పోస్టు కలకలం రేపింది. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి ప్రభుత్వ పాలనను విమర్శించేలా పోస్టులు పెట్టి అధిష్టానం ఆగ్రహానికి గురయ్యారు ఎమ్మెల్యే.అసెంబ్లీ సమావేశాల ప్రారంభం రోజు కొలికపూడిని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో మందలించినట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయమై సీఎం సీరియస్‌గా ఉన్నారని, ఇకపైనా ఇలాగే వ్యవహరిస్తే ఎమ్మెల్యేగా గుర్తించడం కూడా మానేస్తామంటూ తేల్చి చెప్పారంటూ ప్రచారం జరిగింది. ఇది జరిగిన రెండు రోజులుకు మంత్రి నారా లోకేశ్ శాసనసభ్యులకు ఇచ్చిన విందులో కొలికపూడి కనిపించారు. దీంతో అధిష్టానంతో ఆయనకు సఖ్యత కుదిరిందనే అభిప్రాయం వ్యక్తమైంది.లేటెస్ట్‌గా కొలికపూడి పెట్టిన పోస్టు మరోసారి చర్చకు దారితీసింది. ఎప్పుడూ విలక్షణంగా పనిచేసే క్రమంలో వివాదాల్లో చిక్కుకుంటున్న ఎమ్మెల్యే కొలికపూడి ఈ సారి అత్యంత జాగ్రత్తగా వాట్సప్ పోస్టు రాశారు. అయితే ఆయన తన వాట్సప్ పోస్టులో వైసీపీ పార్టీ పేరు ప్రస్తావించడం తీవ్ర చర్చకు దారితీసింది.సీఎం చంద్రబాబు డైరెక్షన్స్ ప్రకారం బడ్జెట్‌పై సలహాలు సూచనల కోసం నియోజకవర్గంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పెట్టాలని భావించిన ఎమ్మెల్యే..ఆ సమావేశానికి వైసీపీతో పాటు ఇతర పార్టీలను ఆహ్వానించారు. మిగతా కూటమి ఎమ్మెల్యేలకు భిన్నంగా కొలికపూడి వ్యవహరించడం చర్చనీయాంశం అయింది. ఈ విషయంపై పార్టీ అధిష్టానం నిలదీస్తే, తనకు రాజకీయంగా అనుభవం లేదని, ఎలా నడుచుకోవాలో మార్గనిర్దేశం చేయాలని సీనియర్లు తనకు సహకరించాలని కొలికపూడి కోరినట్లు వార్తలు వచ్చాయి.అయితే కొలికపూడి సహజ శైలినే ఆయనను కాంట్రవర్సీల్లోకి లాగుతుందన్న చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ దక్కదేమోనన్న అసంతృప్తి ఒకటి అయితే..తన ఎజెండా ప్రకారం పనిచేసుకుంటూ పోవడమే కొలికపూడిని కాంట్రవర్సీల్లో పడేస్తుందని అంటున్నారు. గతంలో సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం శిక్షణ, మార్గ దర్శకత్వం అందించిన ఆయన..ఆ తర్వాత ప్రజా ఉద్యమాల్లో పనిచేశారు. అమరావతి రైతుల పక్షాన గళమెత్తి నిత్యం టీవీ డిబేట్లలో కూర్చొని పాపులర్ అయిపోయారు.కానీ ఎమ్మెల్యే అయినప్పటి నుంచి ఉన్న పాపులారిటీ పోయేలా బిహేవ్ చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు..పైగా ప్రజా ఉద్యమాల్లో ఉన్నప్పుడు సమస్యలపై ఎలా గళమెత్తినా నడుస్తుంది.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి


## తమ్ముళ్ల ధిక్కార స్వరం

**ఏలూరు, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** ఏపీలో టీడీపీకి కంచుకోట లాంటి నియోజకవర్గాలు చాలానే ఉన్నాయి. గతంలో కాంగ్రెస్, వైసీపీ గాలిలోనూ గెలిచిన సీట్లు ఉన్నాయి. అలాంటి నియోజకవర్గాల్లో ఉండి కూడా ఒకటి. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి నియోకవర్గంలో టీడీపీ వరుస విజయాలు దక్కించుకోవడమే కాదు. 2004లో తప్ప..ఎప్పుడూ అక్కడ పార్టీ ఓడింది లేదు. క్షత్రియులకు బలమైన సెగ్మెంట్‌గా ఉన్న ఈ నియోజకవర్గంలో ఎప్పుడూ సైకిల్‌దే హవా. పార్టీ ఆవిర్భావం నుంచి ఇక్కడ పాగా వేసేందుకు వైసీపీ చేయని ప్రయత్నాలు లేవు. గత ఎన్నికల్లో అభ్యర్థిని మార్చి లాస్ట్ మూమెంట్‌లో వైసీపీ నుంచి వచ్చిన రఘురామ కృష్ణరాజుకు టీడీపీ సీటు ఇచ్చినా..ప్రజలు సైకిల్ పార్టీకే పట్టం కట్టారు.నియోజకవర్గంలో టీడీపీ నేతల ధిక్కార స్వరం చర్చనీయాంశంగా మారింది. ఏకంగా రఘురామ కృష్ణరాజు తీరుపై విమర్శలు, ఆరోపణలు చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. ఎమ్మెల్యే కమ్..ఉప సభాపతిగా ఉన్న రఘురామ కృష్ణరాజు వైఖరిని తప్పుబడుతూ..ఒకరిద్దరు టీడీపీ నేతలు చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఆయన ఒంటెత్తు పోకడలకు పోతున్నారని..రఘురామ తీరుతో పార్టీలో ఐక్యత దెబ్బతింటోందని కొందరు లీడర్లు ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తూ చర్చకు దారితీశారు. రఘురామ ముందు నుంచి టీడీపీలో పనిచేసిన నేత కాకపోవడంతో ఇక్కడ తెలుగు తమ్ముళ్లు అసంతృప్తి రాగం ఎత్తుకున్నట్లు చర్చ జరుగుతోంది. వాస్తవానికి గతంలో ఎప్పుడూ టీడీపీలో పని చేయలేదు రఘురామ కృష్ణరాజు. బిజినెస్‌మెన్‌గా వెరీ పాపులర్. ఆ తర్వాత వైసీపీలో, బీజేపీలో తిరిగి వైసీపీలో పనిచేసి 2019లో ఎంపీగా గెలిచారు. ఆ తర్వాత కొన్నాళ్లకే వైసీపీ అధిష్టానంతో గిట్టక అసంతృప్తి రాగం వినిపిస్తూ వచ్చారు. జగన్ సర్కార్ హయాంలో ఆయన కేసులు కూడా ఫేస్ చేశారు. ఆ తర్వాత టీడీపీకి దగ్గరవుతూ వచ్చారు. ఫైనల్‌గా 2024కు ముందు రఘురామ కృష్ణరాజు టీడీపీలో చేరారు. నరసాపురం ఎంపీ టిక్కెట్ ఆశించినా కూటమి పొత్తులో అది బీజేపీకి ఇచ్చారు. దీంతో ఉండి సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదని..టీడీపీ రఘురామ కృష్ణరాజుకు టికెట్ ఇచ్చింది.అయితే వైసీపీ నుంచి వచ్చిన రఘురామ కృష్ణ తన అనుచరులను..గతంలో వైసీపీలో పనిచేసిన నేతలను ప్రోత్సహిస్తూ వారికే పదవులు కట్టబెడుతున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వైసీపీ నుంచి వచ్చిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెడుతూ, పార్టీ కమిటీల్లోనూ ఇతర పార్టీల నేతలకు అవకాశాలు ఇస్తున్నారని..సీనియర్ నేతలను పట్టించుకోవడం లేదని..టీడీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొత్తూరి వెంకటేశ్వరరాజు అలిగేషన్స్ చేస్తున్నారు. రఘురామను వ్యతిరేకిస్తే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తన కొడుకు రాజకీయ అరంగేట్రం కోసం రఘురామ కృష్ణరాజు ఇప్పటినుంచే తన వర్గాన్ని ఏర్పాటు చేసుకున్నారని కూడా చెప్తున్నారు. దీంతో ఉండి టీడీపీలో పరిణామాలపై అధిష్టానం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.అయితే ఏ పార్టీలో అయినా ఏ నియోజకవర్గంలో అయినా కొత్త, పాత లొల్లి కామన్. పార్టీ అన్నాక సమస్యలు..పదవుల దగ్గర పేచీ కూడా ఉండనే ఉంటుంది. సీనియర్ లీడర్ల అసంతృప్తి కూడా ఉండనే ఉంటుంది. వాటిన్నింటిని సామరస్యంగా పరిష్కరించుకుంటే నో ప్రాబ్లమ్. పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను సాల్వ్ చేసుకోవచ్చు. కానీ కొందరు నేతలు..బహిరంగ విమర్శలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ఇలా తెలుగు తమ్ముళ్లు ఓపెన్ స్టేట్‌మెంట్లు ఇస్తే ప్రత్యర్థులకు అస్త్రాలు అందించినట్లు అవుతుందని అంటున్నారు. అటు ఏపీ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామ కృష్ణరాజుకు సొంత నియోజకవర్గంలో లీడర్ల నుంచి అసంతృప్తి సెగ తగలడం చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో ప్రముఖ నేతగా ఉన్న ఆయనపై సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగరవేయడం కలకలం రేపుతోంది. రఘురామ తీరుతో టీడీపీని నమ్ముకుని ఉన్న కార్యకర్తలు, నాయకులు ఆగమైపోతున్నారని, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కలగజేసుకోవాలని కోరుతున్నారు స్థానిక నేతలు.అయితే ఉండి నియోజకవర్గంలో ఎప్పుడూ లేనట్లుగా విభేదాలు రచ్చకెక్కడం..తొలిసారి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న రఘురామపై ఆరోపణలు చేయడం సంచలనంగా మారింది. అసలు ఈ పరిస్థితికి కారణమేంటి? రఘురామ ఒంటెద్దు పోకడలకు పోతున్నారా? లేక ఎన్నికలకు ముందు టీడీపీలోకి వచ్చిన రఘురామకు టీడీపీ క్యాడర్, లీడర్లతో సరైన సంబంధాలు లేవా? లేక టీడీపీ నేతలకే రఘురామ అంటే గిట్టట్లేదా? అన్నది హాట్ టాపిక్ అవుతోంది. ఉండి నియోజకవర్గంలో పరిస్థితులపై పార్టీ హైకమాండ్ కూడా ఆరా తీసిందన్న వార్తలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఇదే సమయంలో గత ప్రభుత్వంలో ఎంపీగా ఉంటూ నిత్యం అసమ్మతి రాగం వినిపించిన రఘురామ ఇప్పుడు అదే పరిస్థితిని ఫేస్ చేస్తుండటం ఇంకా ఇంట్రెస్టింగ్‌గా మారింది.

## ఉగాది నాటికి డీఎస్సీ




**విశాఖపట్టణం, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే క్షేత్ర స్థాయి నుంచి ఖాళీల వివరాలను సేకరించింది. మొత్తం 3,600 వరకు పోస్టులు ఉండొచ్చని తెలుస్తోంది. దీంతో ఈ పోస్టులకు మార్చిలో అంటే ఉగాది పండుగ సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనుందని ప్రభుత్వ వర్గాల సమాచారం.ప్రతీయేటా డీఎస్సీ నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీ మేరకు ఈ ఏడాది కూడా డీఎస్సీ ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. గతేడాది ఏప్రిల్ నెలలో మొత్తం 16,347 పోస్టులకు డీఎస్సీ ప్రకటించగా.. వీటిలో 15,941 పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. కొన్ని పోస్టులకు రిజర్వేషన్ల అభ్యర్థులు లేకపోవడంతో నిలిచిపోయాయి.అయితే, ఈ ఏడాదికి సంబంధించిన డీఎస్సీని వచ్చే నెలలోనే ఉగాది పండుగ సందర్భంగా ప్రకటించాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంది. ఈ ఏడాది డీఎస్సీకి కూడా గత ఏడాది డీఎస్సీ మాదిరిగానే సిలబస్, మార్గదర్శకాలనే అమలు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే వెబ్‌సైట్‌లో ప్రత్యేక డీఎస్సీ సిలబస్‌ను అధికారులు అందుబాటులో ఉంచారు.ఈ ఏడాది నిర్వహించే డీఎస్సీలో భాగంగా పోస్టుల భర్తీ నిమిత్తం.. రాష్ట్ర సంక్షేమ శాఖలకు సంబంధించిన స్కూల్స్, ఆదర్శ పాఠశాలలు, ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ల నుంచి అధికారులు సమాచారం తీసుకున్నారు. వీటిల్లో 1200 ఖాళీలు ఉంటాయని, వీటితోపాటు మున్సిపల్, పంచాయతీరాజ్, ప్రభుత్వ పాఠశాలల్లో 1,700 పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 700 వరకు ఉంటాయని చెబుతున్నారు. ఇవన్నీ కలిపి మొత్తం 3,600 వరకు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇక కాంట్రాక్ట్ ప్రాతిపదికన పని చేస్తున్న టీచర్లకు డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం వీరికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని నిర్ణయించింది.

# గూగుల్.. అడ్డంకులు లేవ్

**విజయవాడ ఫిబ్రవరి 20 పెన్ పవర్:** విశాఖపట్నంలో గూగుల్ సంస్థ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం, గూగుల్ మధ్య ఒప్పందం చేసుకున్నారు. అయితే గూగుల్ డేటా సెంటర్‌కు సంబంధించిన భూసేకరణ సమస్యలు ఎదురయ్యాయి.. కొందరు రైతులు కోర్టుకు వెళ్లడంతో ఇబ్బందులు వచ్చాయి. అయితే ప్రభుత్వం రైతులకు పరిహారం పెంచడంతో భూసేకరణ వేగవంతం అయ్యింది. తాజాగా మిగిలిన ఒక్క రైతు కూడా భూసేకరణకు అంగీకారపత్రం ఇచ్చారు.విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు లైన్ క్లియర్ అయ్యింది. భూసేకరణ సమస్యలన్ని కొలిక్కి వచ్చాయి.. అవాంతరాలన్నీ దాటుకుని శంకుస్థాపనకు సిద్ధమవుతున్నారు. భూసేకరణకు ప్రభుత్వం, స్థానిక ప్రజా ప్రతినిధులు రైతుల్ని ఒప్పించి పరిహారం కూడా జమ చేశారు. ఈ భూసేకరణ ప్రక్రియలో మిగిలిన ఒక్క రైతు కూడా భూమిని ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. దీంతో గూగుల్ డేటా సెంటర్‌కు అడ్డంకులు తొలగిపోయాయి.. అన్నీ కుదిరితే వచ్చే నెలలోనే శంకుస్థాపన చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.గూగుల్ డేటా సెంటర్‌కు సంబంధించి భూసేకరణకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తర్లువాడ రైతుల పేరుతో భూసేకరణపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత ఊహించని విధంగా కొందరు రైతులు తమ సంతకాలను ఫోర్జరీ చేసి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై ఆర్డీవో విచారణ కూడా జరిపారు. కొంతమంది రైతుల్ని ప్రలోభాలకు గురిచేసినట్లు తేలిందని వార్తలొచ్చాయి. తమకు భూములు ఇస్తే లక్షల్లో ఇస్తామని.. ప్లాట్ డెవలప్‌చేసి ఇస్తామని నమ్మించినట్లు గుర్తించారు. భూములు ఇచ్చేందుకు ఓకే చెబితే చాలు.. చెప్పిన దాంట్లో 50శాతం బ్యాంక్ అకౌంట్‌లలో జమ చేస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు.ఆ వెంటనే భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. రైతుల సమస్యలు, భూసేకరణ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆ తర్వాత పరిహారాన్ని




పెంచారు.. గతంలో రూ.17 లక్షలుగా ఉన్న పరిహారాన్ని.. రూ.40 లక్షలకు పెంచారు. అంతేకాదు 20 సెంట్ల భూమిని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేకాదు రికార్డుల్లో లేని శివాయ్ జమేదార్ భూములకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ రైతులకు పరిహారాన్ని ఎకరాకు రూ.10 లక్షలకు పెంచారు. ఇటు ఇంటికో ఉద్యోగం, ఉపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు ఇలా హామీలు ఇచ్చారు. 520 మంది రైతులకు బంజరు భూముల అభివృద్ధి పథకం కింద 3సెంట్ల నివాస స్థలాలు ఇస్తామని ప్రకటించారు. ప్రభుత్వం పరిహారం పెంచడంతో పాటుగా మరికొన్ని వరాలు ప్రకటించడంతో రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలిపారు.ఈ భూసేకరణ ప్రక్రియలో ఒకే ఒక్క రైతు మిగిలారు. గణేష్ అనే రైతు మొన్నటి వరకు భూమిని ఇచ్చేందుకు నిరాకరించారు. ఆయన కూడా చివరికి భూమిని ఇచ్చేందుకు ముందుకొచ్చారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును రెండు రోజుల క్రితం కలిసి తన అసైన్డ్ భూమి రూ.1.94 ఎకరాలు ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే రెవెన్యూ అధికారుల్ని కలిసి భూమిని ఇచ్చేందుకు అంగీకార పత్రాలను సమర్పించారు. దీంతో భూసేకరణకు లైన్ క్లియర్ అయ్యింది. మరోవైపు విశాఖపట్నంలో గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్‌కు అదనపు భూముల్ని ఇవ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం అదనపు భూములు ఇచ్చేందుకు అంగీకారం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో రైడెన్‌కు 480 ఎకరాలు కేటాయించేందుకు అనుమతి ఇచ్చారు. ఇప్పుడు దానిని 601.40 ఎకరాలకు పెంచారు. రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వెయ్యి మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే.

# ఏపీలో మరో కొత్త రైల్వే స్టేషన్ రెడీ



**ఒంగోలు, ఫిబ్రవరి 20, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్‌లో భాగంగా కనిగిరి కొత్త రైల్వే స్టేషన్ సిద్ధమైంది. పదేళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు కూటమి ప్రభుత్వ చొరవతో ఊపందుకుంది. అత్యాధునిక సౌకర్యాలతో సిద్ధమైన ఈ స్టేషన్‌కు ట్రయల్ రన్ జరగనుంది. ఈ నడికుడి - శ్రీకాళహస్తి కొత్త రైల్వే లైన్ పూర్తయితే ప్రయాణ సౌకర్యం మెరుగుపడి, హైదరాబాద్-తిరుపతి మధ్య ప్రయాణ సమయం తగ్గుతుంది. పదేళ్లుగా నిలిచిపోయిన ఈ ప్రాజెక్టు పనులు కూటమి ప్రభుత్వం చొరవతో ఊపందుకున్నాయి. ప్రకాశం జిల్లాలో పనులు చకచకా పూర్తి చేస్తున్నారు. ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఆ సమస్యలను పరిష్కరించారు. కొత్తూరు దగ్గర రైల్వే స్టేషన్ నిర్మాణం కూడా పూర్తయింది. దీంతో కనిగిరి ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరనుంది. ఈ రైల్వే లైన్ పూర్తయితే ప్రయాణ సౌకర్యం మెరుగుపడుతుంది. ఈ రైల్వే లైన్ నిర్మాణం చాలా వేగంగా ముందుకు సాగుతోంది. అత్యాధునిక సౌకర్యాలతో కనిగిరి వరకు పనులు దాదాపుగా సిద్ధమయ్యాయి. గత పదేళ్లుగా ఈ ప్రాజెక్టు ముందుకు సాగలేదు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనికి ప్రాధాన్యత ఇచ్చి పనులు వేగవంతం చేసింది.కనిగిరి రైల్వే స్టేషన్ ఆధునిక సౌకర్యాలతో సిద్ధమైంది. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రయాణికులు సులభంగా స్టేషన్‌కు చేరుకునేలా ప్రత్యేకంగా సీసీ రోడ్డును నిర్మించారు. స్టేషన్ చుట్టూ విశాలమైన సర్క్యులేటింగ్ ఏరియాను అందుబాటులోకి తెచ్చారు. దీనివల్ల ప్రయాణికులు ఎంతో సౌకర్యవంతంగా రాకపోకలు సాగించవచ్చు. కనిగిరి, పామూరు మండలాల మధ్య 50 కిలోమీటర్ల మేర నిర్మాణ పనులు చాలా వేగంగా పూర్తి చేశారు రైల్వే అధికారులు. దీంతో నడికుడి నుంచి కనిగిరి ప్రాంతం వరకు రైలు ఇంజిన్‌తో ట్రయల్ రన్ నిర్వహించారు. దీంతో మూడు దశాబ్దాలుగా కనిగిరి ప్రజలు ఎదురు చూస్తున్న కల త్వరలో నెరవేరనుంది. కనిగిరి మండలంలోని యడవల్లి, పోలవరం, కలగట్ల దగ్గర రైల్వే స్టేషన్లు, సిబ్బంది క్వార్టర్ల పనులు కూడా పూర్తయ్యాయి. వాస్తవానికి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఐదేళ్ల క్రితమే రైలు కూత వినిపించాల్సి ఉన్నా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వలేదు.. ఇతర సమస్యలను పరిష్కరించడంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి.స్టేషన్‌లో హైలెవల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేశారు. ప్రయాణికుల భద్రత కోసం కాప్ సబ్‌టైప్ షెల్టర్లు నిర్మించారు. అవసరమైన చోట్ల నీటి కుళాయిలను కూడా ఏర్పాటు చేశారు. ప్రయాణికులు సేదతీరేందుకు విశ్రాంతి గది, టికెట్లు బుక్ చేసుకోవడానికి బుకింగ్ కౌంటర్ సిద్ధంగా ఉన్నాయి. స్టేషన్ ముందు భాగంలో పోర్టికో, అందమైన ల్యాండ్‌స్కేపింగ్ కూడా ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. కనిగిరి రైల్వే స్టేషన్‌కు ట్రయల్ రన్‌గా రైలు రానుందని రైల్వే శాఖ డిప్యూటీ సీఈ తెలిపారు.గత నెలలో కూడా గూడ్స్ రైలు కనిగిరి ప్రాంతానికి వచ్చింది. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణ పనులకు అవసరమైన సామాగ్రిని తీసుకొని వచ్చింది. ఈ రైలు ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ నుంచి బయలుదేరింది. ఇందులో రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన సామాగ్రి ఉంది. ఈ సామాగ్రిని కనిగిరి స్టేషన్‌లో దించారు. అక్కడి నుంచి నిర్మాణ స్థలాలకు తరలించారు. ఈ రైలు రాకతో స్థానికుల్లో ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైలును చూసి వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ రైల్వే లైన్ నిర్మాణంఈ ప్రాంత అభివృద్ధికి కీలక ముందడుగు. ఈ లైన్ పూర్తయితే, ప్రయాణికులకు, సరుకు రవాణాకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. కనిగిరితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా ఇది ఎంతో ప్రయోజనకరంగా మారుతుంది.నడికుడి - శ్రీకాళహస్తి మధ్య కొత్త రైల్వే లైన్‌లో భాగంగా ప్రకాశం జిల్లాలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి.

ఇప్పటికే దర్శి, పొదిలి రైల్వే స్టేషన్‌లు సిద్ధం అయ్యాయి.. కనిగిరి రైల్వే స్టేషన్ పనులు కూడా పూర్తి చేసి ట్రయల్ రన్‌కు సిద్ధమయ్యారు. నడికుడి నుంచి ప్రకాశం జిల్లా వరకు దాదాపు 80 నుంచి 90శాతం వరకు పనులు పూర్తి చేశారు. ఆ తర్వాత నెల్లూరు జిల్లాలో పనులు చేపట్టనున్నారు. నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లేవారికి సౌకర్యంగా ఉంటుంది. అంతేకాదు ప్రయాణ సమయం, దూరం కూడా తగ్గుతుంది అంటున్నారు


## ప్లాన్ మాములుగా లేదు: అభిషేక్‌ను పవర్ ప్లేలోనే ఔట్ చేసేందుకు సౌతాఫ్రికా భారీ స్కెచ్..!



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్? సూపర్ 8 రౌండ్?లో భాగంగా ఇండియా, సౌతాఫ్రికా తలపడనున్నాయి. 2026, ఫిబ్రవరి 22న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో ఈ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచులో ఎలాగైనా గెలిచి సెమీస్?కు లైన్ క్లియర్ చేసుకోవాలని ఇరు జట్లు భావిస్తున్నాయి. ఈ క్రమంలో టీమిండియా బలహీనతలపై సౌతాఫ్రికా ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగానే ఫామ్?లేమితో సతమతమవుతోన్న టీమిండియా స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మను పవర్ ప్లేలోనే ఔట్ చేసేందుకు ప్రొటీస్ జట్టు వ్యూహం పన్నుతోంది. ఈ వరల్డ్ కప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత యువ ఓపెనర్ అట్టర్ ఫ్లాఫ్ అయ్యాడు. గ్రూప్ స్టేజ్‌లో మూడు మ్యాచులు ఆడి మూడింట్లో డకౌట్ అయ్యి తీవ్రంగా నిరాశ పర్చాడు. ముఖ్యంగా స్పిన్‌ను ఎదుర్కొవడంలో అభి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాడు. మూడు మ్యాచుల్లో స్పిన్ బౌలింగ్‌లోనే ఔట్ కావడం అతడి బలహీనతను బయటపెడుతోంది. ఈ విషయాన్ని గమనించిన దాయాది పాకిస్తాన్ జట్టు ఇదే స్పిన్ వ్యూహంతో అభిషేక్ శర్మను బోల్తా కొట్టించింది.గ్రూప్ దశలో ఇండియా, పాక్ మధ్య జరిగిన హైఓల్టేజ్ పోరులో పాక్ కెప్టెన్ సల్మాన్ అఘా తొలి ఓవర్లలోనే అభిషేక్‌ను ఔట్ చేశాడు. షాహీన్ అఫ్రీది వంటి ప్రపంచస్థాయి ఫాస్ట్ బౌలర్?ను కూడా పక్కన పెట్టి స్వయంగా సల్మాన్ అఘానే ఫస్ట్ ఓవర్ వేశాడు. ఇందుకు ప్రధాన కారణం అభి స్పిన్?ను ఎదుర్కొవడంలో ఇబ్బంది పడటమే. అనుకున్నట్లుగానే పాకిస్తాన్ ప్లాన్ వర్కౌట్ అయ్యింది. సల్మాన్ అఘా బౌలింగ్‌లో అభి ఫస్ట్ ఓవర్లోనే క్యాచ్ ఔట్ పెవిలియన్ బాట్ పట్టాడు. సూపర్ 8కు ముందు సౌతాఫ్రికా కూడా పాకిస్తాన్ వ్యూహాన్నే అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. అభిషేక్?పై స్పిన్ మంత్రం ప్రయోగించాలని ప్రొటీస్ కెప్టెన్ మార్క్రమ్ ప్లాన్ చేస్తున్నాడు. సేమ్ సల్మాన్ అఘా మాదిరిగానే తాను స్పిన్ బౌలింగ్ వేసి పవర్ ప్లేలోనే డేంజరస్ అభిషేక్ శర్మను ఔట్ చేయాలని మార్క్రమ్ వ్యూహం

రచించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే మార్క్రమ్ ప్రాక్టీస్ సెషన్‌లో లెఫ్టార్మ్ బ్యాటర్లకు స్పిన్ బౌలింగ్ చేస్తూ కనిపించాడు. అభిని క్లీన్ బౌల్డ్ చేసిన నెదర్లాండ్స్ బౌలర్ ఆర్యన్ దత్ బౌలింగ్ శైలీని మార్క్రమ్ తీవ్రంగా ప్రాక్టీస్ చేశాడు. మరో సౌతాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ కూడా నెట్స్‌లో కఠినంగా శిక్షణ పొందాడు. దీంతో భారత ఓపెనర్లను దెబ్బకొట్టేందుకు స్పిన్ అస్త్రాన్నే ప్రయోగించాలని సౌతాఫ్రికా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

# టాపర్స్‌కి ఒక గ్రూప్, రన్నర్స్‌కి మరో గ్రూప్.. ఇదేక్కడి ప్రి-సీడింగ్ మావా అంటూ ట్రోలింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచ కప్‌లోని సూపర్-8 ఫార్మాట్‌పై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రస్తుతం తీవ్ర స్థాయిలో విమర్శలను ఎదుర్కొంటుంది. ప్రీ-సీడింగ్ విధానంతో టోర్నీలో అసమతుల్యత ఏర్పడిందని క్రికెట్ అభిమానులు మండిపడుతున్నారు. మరి.. ప్రీ-సీడింగ్ విధానం విషయంలో ఐసీసీపై క్రీడా వర్గాలు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేయడానికి గల ప్రధాన కారణం ఇప్పుడు తెలుసుకుందాం.. సాధారణంగా ఏదైనా టోర్నమెంట్లో గ్రూప్ స్టేజ్ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచిన టీమ్స్ ని నెక్స్ట్ రౌండ్ లో కాస్త ఉపశమనం కలిగించేలా సీడింగ్ విధానం అమలు చేస్తుంటారు. ఈసారి మాత్రం ఐసీసీ టీ20 ప్రపంచ కప్-2026 టోర్నమెంట్ ప్రారంభం కాకముందే.. ఏ టీమ్ ఏ గ్రూపులో ఉండాలో ఫిక్స్ చేసేసింది. మెగా టోర్నీ స్టార్ట్ కాకముందే సీడింగ్ చేయడంతో దీన్ని ప్రీ-సీడింగ్ అని పిలుస్తుంటారు. దీని అర్థం ఏంటంటే.. ఒక టీమ్ తన గ్రూపులో మొదటి స్థానంలో నిలిచినా, సెకండ్ ప్లేస్ లో నిలిచినా... ముందుగా అనుకున్న స్లాట్‌లోనే ఉంటుంది. ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఒక విచిత్రమైన పరిస్థితి నెలకొంది. గ్రూప్ స్టేజ్‌లో లీగ్ టాపర్స్ గా నిలిచిన టీమిండియా, వెస్టిండీస్, సౌతాఫ్రికా, జింబాబ్వే టీమ్స్.. సూపర్ 8లో ఒకే గ్రూపులో ఉండగా, మరోవైపు రెండో స్థానంలో నిలిచిన పాక్, శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లండ్ జట్లు ఇంకో దాంట్లో ( గ్రూప్-2) ఉన్నాయి. ఈ విధానమే ప్రస్తుతం క్రికెట్ అభిమానులతో పాటు క్రీడా విశ్లేషకుల నుంచి ఐసీసీ విమర్శలు ఎదుర్కొనేలా చేస్తుంది.

ఈ విధానంతో గ్రూప్ స్టేజ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన 4 టీమ్స్ లో రెండు జట్లు ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అదే సమయంలో గ్రూప్ స్టేజ్‌లో రెండో స్థానంలో ఉన్న రెండు జట్లకు సెమీస్‌కు చేరడం ఈజీ కానుంది. ఇది టాపర్లుగా నిలిచిన టీమ్స్ కు అన్యాయం చేసినట్లేనని.. ప్రతిభను గౌరవించేలా ఐసీసీ నిర్ణయం లేదని పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సూపర్-8 ఫార్మాట్ విధానంపై వస్తున్న విమర్శలపై ఐసీసీ రియాక్ట్ అయింది. ఈ మెగా టోర్నీని భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.. రవాణా, భద్రత, బ్రాడ్‌కాస్టింగ్ షెడ్యూల్‌కు సంబంధించి ముందుగానే షెడ్యూల్ ప్లాన్ చేసుకోవడం కోసమే ఇలా చేశామని తేల్చి చెప్పింది. వేల సంఖ్యలో ప్రయాణించే ఫ్యాన్స్, మీడియాకు ఇబ్బంది కలగకుండా ఏ జట్టు ఎక్కడ ఆడుతుందో ముందే తెలిస్తే ఈజీగా ఉంటుందని ఐసీసీ ప్రీ-సీడింగ్ విధానాన్ని సమర్థించుకుంది.

## భారత్ సెమీస్‌కి వెళ్లదు..'ఓరే పిచ్చి నా కొడకా!'అంటూ పాక్ మాజీ క్రికెటర్‌పై నెటిజన్స్ ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా రేపటి నుంచి జరిగే సూపర్--8 దశలో జరిగే ప్రతి మ్యాచ్ 'డూ ఆర్ డై' లాంటిదే. సెమీఫైనల్స్ టార్గెట్ గా ఎనిమిది జట్లు బరిలోకి దిగుతున్నాయి. సూపర్--8 దశ ప్రారంభానికి ముందే పాకిస్తాన్ మాజీ పేసర్ మహ్మద్ అమీర్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్ సెమీఫైనల్స్‌కి చేరదని స్పష్టం చేశాడు. పాకిస్తాన్‌తో మ్యాచ్ తప్ప భారత్ బ్యాటింగ్ అంతగా నిలకడగా కనిపించలేదనే అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఒత్తిడి తట్టుకోలేక భారత బ్యాటింగ్ కూలిపోతుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించాడు. దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు చాలా బలంగా ఉన్నాయి.. ఈ రెండు టీమ్స్ ఏ జట్టునైనా ఓడించే సత్తా ఉందని పేర్కొన్నాడు.

పాకిస్తాన్ మాజీ క్రికెటర్ మహ్మద్ అమీర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అమీర్ వ్యాఖ్యలపై నెటిజన్లు స్పందిస్తూ, దాయాది దేశం నిరంతరం భారత్‌పై అక్కసు వెల్లగక్కడం తప్ప మరో పని లేదని మండిపడ్డారు. 'ఓరే పిచ్చి నా కొడకా!'అమీరు.. ముందు నీ పి(పా) కిస్తాన్ ని న్యూజిలాండ్ తో జరిగే మ్యాచ్ లో గెలవమని చెప్పుపో అంటూ సూచనలు చేస్తున్నారు. మరోసారి టీమిండియాపై తప్పుడు వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా స్పందిస్తామని నెటిజన్లు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

భారత్ ఇప్పటి వరకు లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో అన్ని గెలిచింది. సూపర్--8లో చిన్న తప్పు జరిగిన కూడా భారీ మూల్యం చెల్లించాల్సిందే. దక్షిణాఫ్రికా దూకుడుతో పాటు క్రమశిక్షణతో ఆడుతోంది. వెస్టిండీస్ పవర్ హిట్టింగ్‌తో చాలా ప్రమాదకరంగా ముందుకు వెళ్తుండగా.. జింబాబ్వే కూడా పెద్ద జట్లకు తామేమి తక్కువ కాదని ఇప్పటికే ఆసీస్, శ్రీలంక జట్లను ఓడించి చూపించింది. భారత మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు కొద్దిగా తడబడినా కూడా, ప్రత్యర్థి టీమ్స్ వెంటనే దాన్ని ఉపయోగించుకుంటున్నాయి. భారత్ సూపర్--8 ప్రయాణం ఫిబ్రవరి 22వ తేదీన అహ్మదాబాద్‌లో నరేంద్ర మోడీ స్టేడియంలో దక్షిణాఫ్రికాతో తమ తొలి మ్యాచ్ ఆడనుంది. అనంతరం ఫిబ్రవరి 26న చెన్నైలో జింబాబ్వేతో, మార్చి 1వ తేదీన కోల్‌కతాలో వెస్టిండీస్‌తో తమ గ్రూప్--1లోని చివరి మ్యాచ్ ఆడుతుంది. ఈ నాలుగు మ్యాచులలో సెమీఫైనల్ చేరాలంటే కనీసం రెండు విజయాలు అవసరం.. కాగితంపై ఈజీగా కనిపించినా.. వాస్తవంగా ప్రతి మ్యాచ్ నాకౌట్‌లాంటిదే.సూపర్--8 గ్రూపులు ఖరారు

గ్రూప్--1: భారత్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్

గ్రూప్--2 శ్రీలంక, పాకిస్తాన్, ఇంగ్లాండ్, న్యూజిలాండ్



ది బ్లఫ్ ప్రెస్ టూర్‌లో ప్రియాంక చోప్రా టోన్ సెట్ చేసింది

# రప్పాడించేస్తోన్న కీర్తి సురేష్!



టాలీవుడ్ లో కీర్తి సురేష్ జర్నీ ఎలా ప్రారంభమై ఎలాంటి టర్నింగ్ లు తీసుకుందో చెప్పాల్సిన పనిలేదు. -మహానటి- తర్వాత కెరీర్ ఒకలా సాగుతుందనుకుంటే? అందుకు భిన్నంగా ప్రయాణం మందుకు సాగింది. కేవలం డీసెంట్ పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరవ్వాలనుకున్న అమ్మడి స్ట్రాటజీ కొంత వరకూ వర్కౌట్ అయింది. కానీ ఇలాగే కొనసాగితే మొదటికే ముప్పు వస్తుందని భావించిన అమ్మడు ఒక్కసారిగా ట్రాక్ మార్చేసింది. వడి వడిగా గ్లామర్ పాత్రల వైపు అడుగులు వేసింది. అదే సమయంలో వివాహం అవ్వడం కలిసొచ్చింది. అప్పటికే పెళ్లైన భామలకు ఇండస్ట్రీలో డిమాండ్ ఏర్పడటంతో? కీర్తి సురేష్ కి కూడా అవకాశాలు మెరుగు పడ్డాయి.మునుపటి కంటే కొత్త అవకాశాలు అందుకోవడంలో వేగం పుంజుకుంది. 2024 లో నాలుగు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలోనే ఉంది. అటుపై ఏడాది రెండు సినిమాలతో అలరించింది. ఇదే సమయంలో బాలీవుడ్ ఎంట్రీ కూడా జరిగిపోయింది. అయితే డెబ్యూ అక్కడ ఆశించిన ఫలితాలు సాధించలేదు. అలాగని నటించిన సినిమాలన్నీ విజయం సాధించాయా? అంటే అదీ జరగలేదు. తన పాత్ర వరకూ న్యాయం చేసినా ఫైనల్ ఔట్ పుట్ ప్రేక్షకుల్ని నిరాశ పరిచింది. ఇందులో కీర్తి తప్పిందం ఎక్కడా కనిపించలేదు. తాజాగా అమ్మడి కిట్టీలో చాలా ప్రాజెక్ట్ లు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం తమిళ్ లో -కన్నెవేడి- అనే చిత్రంలో నటిస్తోంది. మలయాళంలో -తొట్టమ్- అనే మరో చిత్రంలోనూ నటిస్తోంది. తెలుగులో -రౌడీ జనార్దన- తోనూ బిజీగా ఉంది. ఇవి గాక వెంకటేష్ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలోనూ ఈ భామనే హీరోయిన్ గా పరిశీలిస్తున్నారు. ఇంత వరకూ ఈ జోడీ వెండి తెరపై కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఆజోడీపై ఆసక్తి నెలకొంది. అలాగే -మహేంద్రగిరి వానర-లోనూ అతిథి పాత్రలో నటిస్తోంది. తాజాగా కోలీవుడ్ లో మరో రెండు ప్రాజెక్ట్ లకు సైన్ చేసినట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.అలాగే హిందీలో కూడా ఓ సినిమాకు కమిట్ అయిందని ప్రచారం జరుగుతోంది. మాలీవుడ్ లో కూడా ఓ సీనియర్ స్టార్ కు జోడీగా నటిస్తుందని వార్తలొస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ లకు సంబంధించి అధికారికంగా విషయం వెల్లడి కావాల్సి ఉంది. సెకెండ్ ఇన్నింగ్స్ లో కీర్తి సురేష్ ఇంత బిజీ గా మారుతుందని తాను కూడా ఊహించి ఉండదు. అమ్మడికి వెంకటేష్ ప్రాజెక్ట్ కీలకమైంది. ఇందులో వెంకీకి జోడీగా సెట్ అయితే గనుక మిగతా సీనియర్ హీరోల సరసన ఛాన్సులు అందుకో వడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే చిరంజీవి, రజనీకాంత్ లాంటి స్టార్స్ చిత్రాల్లో కీలక పాత్రల్లో నటించిన సంగతి తెలిసిందే.



రాశి సింగ్ మోనోక్రోమ్ మ్యాజిక్

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D V RAO, FLAT NO: 402, VIGNESWARA PRANATHI REDDY TOWERS, OPP. BHARAT PETROLBUNK, VIDYANAGAR, TIRUPATI Dist.,editor GANTYADA APPARAO. PRGI Registration No. "APTEL/25/A4409" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965